# ప్రజా మంటలు

తెలంగాణ జాతీయ దినపత్రిక

ఎడిటర్ : సిహెచ్.వి. ప్రభాకర్ రావు








ప్రచురణ : జగిత్యాల సంపుటి : 05 సంచిక : 359 పేజీలు : 04 వెల రూ. 2 గురువారం 13 - 08 - 2026


## సుందిళ్ల, అన్నారం, మేడిగడ్డ విషయంలో
# ఎన్‌డీఎస్‌ఏ సూచనలు పాటించాలి

- తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీలో నీటిపారుదల, పౌరసరఫరాల శాఖలపై సీఎం రేవంత్ సమీక్ష
- సమీక్షకు హాజరైన మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఉన్నతాధికారులు
- ప్రతీ ధాన్యం గింజకు సంబంధించిన బకాయి వసూలు చేయాల్సిందేనని స్పష్టం



**హైదరాబాద్ :** గోదావరి జలాలను గరిష్ట స్థాయిలో వినియోగించుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశించారు. ఎల్లంపల్లితో పాటు దేవాదుల, సీతారామ ప్రాజెక్టుల నుంచి సాధ్యమైనంత మేరకు నీటిని ఎత్తిపోయాలన్నారు. ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీలోని బోధి పెవెలియన్‌లో నీటిపారుదల, పౌరసరఫరాల శాఖలపై సీఎం రేవంత్‌రెడ్డి సమీక్ష నిర్వహించారు. ఎన్డీఎస్ఏ సూచనల మేరకే సుందరిళ్ల, అన్నారం, మేడిగడ్డ బ్యారేజీల్లో నీరు నిల్వ చేయడం లేదన్నారు. మేడిగడ్డతో పాటు సుందిళ్ల బ్యారేజీలోనూ అనేక లోపాలు ఉన్నట్లు తేలిందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి చెప్పగా, మూడు బ్యారేజీల విషయంలో ఎన్డీఎస్ఏను సంప్రదించాలని సీఎం రేవంత్ రెడ్డి సూచించారు. దేవాదుల నుంచి గతంలో ఎన్నడూ లేని విధంగా 9 పంపులతో ఎత్తిపోతలు చేపట్టామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. దేవాదుల, సీతారామ ప్రాజెక్టుల నుంచి ఎత్తిపోతలకు సంబంధించి చిన్న చిన్న సమస్యలుంటే వాటి పరిష్కారంపై ప్రత్యేకంగా దృష్టి పెట్టాలని అధికారులకు సీఎం సూచించారు. పలు ప్రాజెక్టుల కింద ఒకట్రెండు గ్రామాల్లోని కొన్ని వ్యవసాయ భూములకు పెండింగులో ఉన్న పరిహారం వెంటనే చెల్లించేలా కార్యాచరణ రూపొందించాలని సీఎం ఆదేశించారు. నీటి పారుదల, రెవెన్యూ అధికారులు క్షేత్ర స్థాయిలో పర్యటించి ముంపు గ్రామాలు, పరిహారం, పునరావాసానికి సంబంధించి వాస్తవ నివేదిక - మిగతా 2 లో

## 'ఉచిత ఆటోమేటిక్ కుట్టు మిషన్ల'
# పథకం నేడు ప్రారంభం



- నియోజకవర్గానికి వెయ్యి మందికి లబ్ధి
- బీసీ మహిళల కోసం ఉచిత కుట్టు మిషన్లను పంపిణీ చేయనున్న ప్రభుత్వం
- ఆన్‌లైన్, మీ-సేవ కేంద్రాల ద్వారా దరఖాస్తుల స్వీకరణ

**హైదరాబాద్ :** రాష్ట్రంలో వెనుకబడిన తరగతుల (బీసీ) మహిళలకు స్వయం ఉపాధి కల్పించి, వారిని ఆర్థికంగా బలోపేతం చేసేందుకు తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. అర్హులైన బీసీ మహిళలకు ఉచితంగా - మిగతా 2 లో



## మేం 'టీ-హబ్' కడితే.. రేవంత్ 'అనుముల హబ్' కడుతున్నారు

- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- సీఎం రేవంత్ రెడ్డి, ఆయన సోదరుడిపై కేటీఆర్ విమర్శల దాడి
- సీఎం సోదరుడి సంస్థకు రూ. 200 కోట్ల విలువైన భూమి కట్టబెట్టారని ఆరోపణ
- ఈ వ్యవహారంపై గవర్నర్‌కు ఫిర్యాదు చేస్తామని, కోర్టును ఆశ్రయిస్తామని వెల్లడి

**హైదరాబాద్ :** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఆయన సోదరుడు అనుముల కొండల్ - మిగతా 2 లో

# జెన్-జీకి ప్రధాని నరేంద్రమోదీ కీలక సూచన



- జీవితంలో షార్ట్‌కట్‌లు ప్రమాదకరమన్న ప్రధాని నరేంద్ర మోదీ
- సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లు, రీల్స్‌తో జాగ్రత్తగా ఉండాలని సూచన
- గొప్ప వ్యక్తుల జీవిత చరిత్రలు చదవాలంటూ యువతకు హితవు
- మాజీ రాష్ట్రపతి కోవింద్ ఆత్మకథ ఆవిష్కరణ సభలో వ్యాఖ్యలు

**ఢిల్లీ :** ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నేటి తరం యువతకు (జెన్-జీ) పలు కీలక సూచనలు చేశారు. జీవితంలో అడ్డదారుల వెంట పడొద్దని, అవి అంతిమంగా తీవ్ర నష్టాలకే దారితీస్తాయని ఆయన హెచ్చరించారు. - మిగతా 2 లో



## రాజ్యసభను కుదిపేసిన "లుంగీవాలా" వివాదం

- తనను లుంగీవాలా అని పిలిచారంటూ బీజేపీ ఎంపీపై సీపీఎం ఎంపీ ఫిర్యాదు
- ఆ వ్యాఖ్యలు తాను చేయలేదని, బ్రిట్టాస్ అబద్ధం చెబుతున్నారని సుస్మితా దేవ్ ఖండన
- ఒకరిపై మరొకరు హక్కుల ఉల్లంఘన నోటీసులు దాఖలు

**ఢిల్లీ :** రాజ్యసభలో బుధవారం 'లుంగీవాలా' వివాదం తీవ్ర దుమారం రేపింది. తనను ఉద్దేశించి బీజేపీ ఎంపీ సుస్మితా దేవ్ ఈ పదాన్ని ఉపయోగించారని కేరళకు చెందిన సీపీఎం - మిగతా 2 లో

# కర్ణాటకలో గుట్కా పాన్‌మసాలాపై నిషేధం

- ప్రజారోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని కీలక నిర్ణయం తీసుకున్న కర్ణాటక ప్రభుత్వం
- ఉత్తర్వులు జారీ చేసిన ఫుడ్ సేఫ్టీ కమిషనరేట్
- రాష్ట్ర వ్యాప్తంగా తనిఖీలు నిర్వహిస్తున్న అధికారులు




**బెంగళూరు :** కర్ణాటక ప్రభుత్వం గుట్కా, పొగాకు లేదా నికోటిన్ ఉన్న పాన్‌మసాలా తయారీ, నిల్వ, పంపిణీ, రవాణా, అమ్మకాలపై ఒక ఏడాది పాటు రాష్ట్రవ్యాప్త నిషేధం విధించింది. ప్రజారోగ్యాన్ని - మిగతా 2 లో

# ఝార్ఖండ్ ప్రభుత్వానికి కాంగ్రెస్ మద్దతు

- ఝార్ఖండ్ విద్యార్థుల ఆందోళనల విషయంలో రాష్ట్ర ప్రభుత్వానికి కాంగ్రెస్ మద్దతు
- నిరసనకారులపై ఎలాంటి బలప్రయోగం జరగలేదని స్పష్టీకరణ
- ఎగ్జామ్ మాఫియాను కాపాడేందుకే బీజేపీ సీబీఐ విచారణ కోరుతోందని ఆరోపణ
- బీజేపీ హయాంలో దేశవ్యాప్తంగా 152 పేపర్ లీక్‌లు జరిగాయన్న కాంగ్రెస్



**ఢిల్లీ :** ఝార్ఖండ్‌లో ఉద్యోగ నియామక పరీక్షల్లో అవకతవకలపై విద్యార్థులు చేపట్టిన ఆందోళనల నేపథ్యంలో, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర సంకీర్ణ ప్రభుత్వానికి పూర్తి మద్దతు ప్రకటించింది. ఆందోళన చేస్తున్న విద్యార్థులపై ఎటువంటి బలప్రయోగం జరగలేదని ఈ సందర్భంగా పార్టీ స్పష్టం చేసింది. ఈ అంశాన్ని పక్కదారి పట్టించేందుకు బీజేపీ ప్రయత్నిస్తోందని, 'ఎగ్జామ్ మాఫియా'ను రక్షించేందుకే ఇదంతా చేస్తోందని కాంగ్రెస్ ఆరోపించింది. బుధవారం నాడు కాంగ్రెస్ మంత్రులు విలేకరులతో మాట్లాడుతూ, నిరసనలు తీవ్రరూపం దాల్చకముందే పేపర్ లీకేజీలను అరికట్టేందుకు - మిగతా 2 లో

# డియర్ యంగ్ ఫ్రెండ్స్

## యువతకు సీఎం చంద్రబాబు సందేశం

- యువతకు సీఎం చంద్రబాబు అంతర్జాతీయ యువజన దినోత్సవ శుభాకాంక్షలు
- యువతే మన శక్తి, బలం, రేపటి ఆశ అని వ్యాఖ్య
- యువత కలలు సాకారం చేసుకునేందుకు పూర్తి స్వేచ్ఛ, అవకాశాలు కల్పిస్తామని హామీ



**అమరావతి :** అంతర్జాతీయ యువజన దినోత్సవం (ఆగస్టు 12) సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు "డియర్ యంగ్ ఫ్రెండ్స్" అంటూ రాష్ట్ర యువతకు శుభాకాంక్షలు తెలిపారు. యువతే మన శక్తి, బలం అని, రేపటి భవిష్యత్తుకు వారే ఆశాకిరణాలని ఆయన అభివర్ణించారు. యువత ఆశయాలకు అనుగుణంగా, వారికి బంగారు భవిష్యత్తును అందించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఆయన - మిగతా 2 లో

## చంద్రబాబు అధ్యక్షతన
# 20వ ఎస్ఐపీబీ సమావేశం

- రూ.2,08,406 కోట్ల పెట్టుబడులు , 25 ప్రాజెక్టులకు ఎస్ఐపీబీ ఆమోదం
- ప్రాజెక్టుల ద్వారా రాష్ట్రవ్యాప్తంగా 21,627 మందికి ప్రత్యక్షంగా ఉద్యోగ అవకాశాలు
- విశాఖ, కర్నూలు, తిరుపతి జిల్లాలకు అత్యధికంగా పెట్టుబడులు
- గ్రామీణ ప్రాంతాలకు పరిశ్రమలు విస్తరించాలని సీఎం ఆదేశం
- అనకాపల్లిలో రెన్యూ ఏపీ గ్రీన్ డేటా సెంటర్ రూ.85,200 కోట్లు
- రూ.2.08 లక్షల కోట్ల విలువైన 25 ప్రాజెక్టులకు ఏకగ్రీవ ఆమోదం



**అమరావతి :** ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన జరిగిన 20వ రాష్ట్రస్థాయి పెట్టుబడుల ప్రోత్సాహక బోర్డు సమావేశంలో రూ. 2,08,406 కోట్ల విలువైన 25 ప్రాజెక్టులకు గ్రీన్‌సిగ్నల్ లభించింది. ఈ ప్రాజెక్టుల ద్వారా 21,627 మందికి ప్రత్యక్ష ఉద్యోగాలు కల్పించనున్నారు. పారిశ్రామిక ప్రోత్సాహకాలను ఎస్క్రో ఖాతాల ద్వారా అందించడంతో పాటు గ్రామీణ ప్రాంతాలకు పరిశ్రమలను విస్తరించాలని సీఎం అధికారులను ఆదేశించారు. అనకాపల్లిలో రెన్యూ ఏపీ గ్రీన్ డేటా సెంటర్ రూ. 85,200 కోట్లు, విశాఖలో డేటా సెంటర్ హోల్డింగ్స్ ఇండియాకు రూ. 58,743 కోట్లు, ఏఎం ఇంటెలిజెన్స్ ల్యాబ్స్‌కు రూ. 31,387 కోట్ల కీలక పెట్టుబడుల ప్రతిపాదనలకు ఆమోదం లభించింది. గ్రీన్ అమ్మోనియా, లిథియం బ్యాటరీలు, రోబోటిక్స్ వంటి భవిష్యత్ రంగాల్లో పెట్టుబడులను ఆకర్షించడంపై పెట్టుబడుల - మిగతా 2 లో

# వై.ఎస్.జగన్ నేడు కర్నూలు జిల్లా పర్యటన




- జైల్లో నేడు విరూపాక్షిని పరామర్శించనున్న జగన్
- ఇటీవల అరెస్ట్ అయి రిమాండ్‌లో ఉన్న ఆలూరు మాజీ ఎమ్మెల్యే విరూపాక్షి
- జైలుకు వెళ్లి పరామర్శించనున్న జగన్
- విరూపాక్షి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పనున్న వైసీపీ అధినేత

**అమరావతి :** వైసీపీ అధినేత జగన్ నేడు కర్నూలు జిల్లా పర్యటన. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి తమ పార్టీ నాయకులు, కార్యకర్తలపై - మిగతా 2 లో

# సంపాదకీయం

## సోషల్ మీడియాపై రణభేరి!

సామాజిక మాధ్యమాలు వచ్చాక ప్రపంచ పరిణామాలన్నీ వెంటవెంటనే అందరికీ చేరుతున్నాయి. అవి భావవ్యక్తీకరణ విస్తృతిని పెంచి కోట్లాదిమందికి గొంతునిస్తు న్నాయి. ఇన్నాళ్లూ మౌనంగా, నిస్సహాయంగా వీక్షించినవారంతా నిక్కచ్చిగా, నిర్మొహ మాటంగా తమ అభిప్రాయాలు వినిపిస్తున్నారు. కానీ మంచితోపాటే చెడు కూడా ఇందులో కలగలిసివుంది. వాటి కారణంగా అనవసర వదంతులు వ్యాపించి ఎందరో అమాయకులు ప్రాణాలు పోగొట్టుకుంటున్నారు. మన దేశం వరకే తీసుకుంటే దొంగ లుగా ముద్రపడి కొన్నిచోట్ల, గోవుల్ని తరలిస్తున్నారని ఆరోపణలొచ్చి మరికొన్నిచోట్ల ఉన్మాద గుంపులు దాడులు చేసి హతమార్చిన ఉదంతాలు అనేకం ఉన్నాయి. టీనేజర్లు, పిల్లల మనసుల్లో ఈ వేదికల దుష్ప్రభావం కూడా నానాటికీ పెరుగుతోంది. మానసిక ఒత్తిళ్లకూ, రుగ్మతలకూ అవి కారణమవుతున్నాయి. అమెరికా అప్పీళ్ల కోర్టులో మెటా, ఆల్ఫాబెట్, స్నాప్‌చాట్, టిక్‌టాక్ తదితర సంస్థలపై సోమవారం 3,000కు పైగా పిటిషన్లు దాఖలు కావటాన్ని ఈ నేపథ్యంలో చూడాలి. 'పబ్లిక్ న్యూసెన్స్' కింద దాదాపు 40 రాష్ట్రాలతోపాటు మున్సిపాలిటీలు, పాఠశాలలు, వ్యక్తులు ఈ పిటిషన్లు దాఖలు చేశారు. వాస్తవానికి మొన్న మార్చిలోనే లాస్ ఏంజెలెస్‌కి చెందిన న్యాయస్థానం సామాజిక మాధ్యమ వేదికల్ని యువతకు హానికరమైన రీతిలో రూపొందించటాన్ని తప్పుబట్టింది. చిన్న వయసులో ఇన్‌స్టాగ్రామ్, యూట్యూబ్‌లు తనను బానిసగా మార్చాయనీ, ఇందువల్ల తీవ్రంగా నష్టపోయాననీ ఆరోపిస్తూ కోర్టుకెక్కిన 20 యేళ్ల యువతికి 60 లక్షల డాలర్ల పరిహారం చెల్లించాలని ఆ న్యాయస్థానం తీర్పునిచ్చింది. న్యూమెక్సికోలో సైతం మెటాపై ఈ తరహా తీర్పే వెలువడింది. వేదికకు సంబంధించిన భద్రత విషయంలో వినియోగదారుల్ని అది తప్పుదోవ పట్టించిందని న్యాయస్థానం నిర్ధారించింది. 37.5 కోట్ల డాలర్ల పరిహారం చెల్లించాలని సంస్థను ఆదేశించింది. చాన్నాళ్లక్రితమే టీనేజర్లపైనా, పిల్లలపైనా సామాజిక మాధ్యమాల దుష్ప్రభావం ఎలా ఉన్నదో ప్రభుత్వాలు గుర్తించాయి. ఆస్ట్రేలియా పదహారేళ్లలోపు పిల్లలకు సామాజిక మాధ్యమాల ప్రవేశాన్ని నిషేధించింది. ఈ విషయంలో తగిన చర్యలు తీసుకునే బాధ్యతను టెక్ సంస్థలపైనే పెట్టింది. దీన్ని పాటించనట్టయితే దాదాపు 5 కోట్ల ఆస్ట్రేలియా డాలర్లు జరిమానా చెల్లించాలని చట్టం నిర్దేశించింది. బ్రిటన్, ఫ్రాన్స్ సైతం ఈ దిశగా చర్యలు తీసుకుంటున్నాయి. యూరోపియన్ యూనియన్(ఈయూ) హానికర మైన పోస్టుల్ని తొలగించటంలో జాప్యం జరిగితే గ్లోబల్ టర్నోవర్‌లో 6 శాతం మొత్తాన్ని జరిమానా విధించే చట్టం తీసుకొచ్చింది.తెలిసో తెలియకో ఏదైనా వీడియో చూస్తే ఆ వెనువెంటనే అటువంటివే కుప్పలు తెప్పలుగా వచ్చిపడేలా ఆ మాధ్యమాలు అల్గారిథమ్‌లు రూపొందిస్తున్నాయి. తెలిసీ తెలియని వయసులో ఉన్న పిల్లల్ని వ్యామోహాల బారిన పడేస్తున్నాయి. ఇలాంటి ఆరోపణలొచ్చినప్పుడల్లా ఈ మాధ్యమాలు తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నాయి. తాము కేవలం ఒక వేదిక మాత్రమే కల్పిస్తున్నామనీ, అందులో వేరెవరో ఉంచే కంటెంట్‌కు తామెలా బాధ్యులమనీ ప్రశ్నిస్తున్నాయి. ఏటా వేలాదికోట్ల డాలర్ల లాభాలు ఆర్జించే ఉద్దేశంతోనే ఈ సంస్థలు జుగుప్సాకర, హింసాత్మక అంశాలున్న వీడియోల్ని చూసీ చూడనట్టు వదిలేస్తున్నాయి.సామాజిక మాధ్యమాలు భావప్రకటనా స్వేచ్ఛకు అనువైనవి. కానీ అవి దుర్వినియోగమైన పక్షంలో కఠినచర్యలుండాలి. మన దేశం ఈ విషయంలో వెనకబడే ఉంది. ప్రభుత్వానికి వ్యతిరేకంగానో, పాలకుల్ని కించపరిచేవిధంగానో పోస్టులున్నప్పుడే తక్షణ స్పందన కనిపిస్తోంది. తెలంగాణలో ఆన్‌లైన్ చానెళ్లు నిర్వహిస్తున్న మహిళా పాత్రికేయులపై అత్యంత జుగుప్సాకరంగా పోస్టులు పెడుతున్నవారిపై చర్యలు లేవు. ఆంధ్రప్రదేశ్‌లో పత్రికల్లో వచ్చిన కథనాలను పోస్టుచేసినందుకే వైఎస్సార్ కాంగ్రెస్ కార్యకర్తల్ని అరెస్టుచేస్తున్న ప్రభుత్వం... ఆ పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డినీ, ఇతర నేతలనూ కించపరుస్తూ పోస్టులు పెట్టే టీడీపీ నేతలనూ, కార్యకర్తలనూ చూసీచూడనట్టు వదిలేస్తోంది. అందుకే అమెరికాలో మాదిరి మన దేశంలో కూడా మాధ్యమాల, ప్రభుత్వాల జవాబుదారీతనాన్ని పెంచే చట్టాన్ని తీసుకురావాలి. అప్పుడు మాత్రమే ఇటువంటి పెడధోరణులు ఆగుతాయి.



# చంద్రబాబు అధ్యక్షతన 20వ ఎస్ఐపీబీ సమావేశం

**మొదటిపేజీ తరువాయి -**

ప్రోత్సాహక మండలి సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రత్యేకంగా దృష్టి సారించారు. ఈ రంగాల్లో పరిశ్రమలను ప్రోత్సహించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై అధ్యయనం చేయాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో ఏర్పాటవుతున్న పారిశ్రామిక ప్రాజెక్టులపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. డేటా సెంటర్లపై ఉన్న అపోహలను తొలగించేలా చర్యలు చేపట్టాలన్నారు. ఉత్తరాంధ్రలో ఏర్పాటు అవుతున్న డేటా సెంటర్లన్నింటికీ 3.5 టీఎంసీల నీరు సరిపోతుందని తెలిపారు. పారిశ్రామిక ప్రగతిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ, రాష్ట్ర ఎకోసిస్టమ్‌కు పరిశ్రమలు జోడిస్తున్న విలువను విశ్లేషించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.రాష్ట్రంలో ఏర్పాటు అవుతున్న రక్షణ రంగ ప్రాజెక్టులు జాతికి గర్వకారణమని సీఎం స్పష్టం చేశారు. పుట్టపర్తి సమీపంలో డిఫెన్స్, హిందూపురం సమీపంలో ఏరోస్పేస్ ప్రాజెక్టులు వచ్చేలా చర్యలు చేపట్టాలని సూచించారు. మూలపేట పోర్టు నిర్మాణాన్ని డిసెంబరులోగా పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. లాజిస్టిక్స్, ఆధునిక వేర్‌హౌసింగ్, కోల్డ్‌చైన్ ప్రాజెక్టులను సమన్వయం చేయాలని సూచించారు. రాయలసీమలో పండే ఉద్యాన ఉత్పత్తులు అంతర్జాతీయ మార్కెట్లకు చేరేలా రోడ్, రైలు, పోర్టు కనెక్టివిటీని అభివృద్ధి చేయాలన్నారు. గత ఏడాది నుంచి కుదుర్చుకున్న పెట్టుబడి ఒప్పందాలు, ఎస్ఐపీబీ ఆమోదించిన ప్రాజెక్టులు వేగంగా కార్యరూపం దాల్చేలా చర్యలు చేపట్టాలని సీఎం ఆదేశించారు.రాష్ట్రంలో ఎంఎస్ఎంఈ రంగాన్ని మరింత బలోపేతం చేసేందుకు ప్రభుత్వం చర్యలు వేగవంతం చేయాలని సీఎం ఆదేశించారు. సెప్టెంబరు నాటికి మిగిలిన 37 ఎంఎస్ఎంఈ పార్కులను పూర్తి చేయాలని అధికారులకు స్పష్టం చేశారు. దీంతో 175 నియోజకవర్గాల్లో పారిశ్రామికవాడలు అందుబాటులోకి తీసుకురావాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. చిన్న పరిశ్రమలకు ప్రోత్సాహకాలు అందించడం ద్వారా స్థానికంగా ఉపాధి అవకాశాలు పెంచాలని సూచించారు. వన్ ఫ్యామిలీ--వన్ ఎంట్రప్రెన్యూర్ కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున చేపట్టాలని సీఎం నిర్దేశించారు. ఇప్పటివరకు జరిగిన 20 ఎస్ఐపీబీ సమావేశాల్లో 363 ప్రతిపాదనలకు రూ.13.78 లక్షల కోట్ల పెట్టుబడులు ఆమోదం పొందగా, 10.86 లక్షల మందికి ఉద్యోగాలు రానున్నాయని అధికారులు సీఎంకు వివరించారు.20వ ఎస్ఐపీబీ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలు పరిశీలిస్తే, కర్నూలు, విశాఖపట్నం, అనకాపల్లి, కాకినాడ, తిరుపతి, నెల్లూరు సహా పలు జిల్లాల్లో భారీ పెట్టుబడులు రానున్నాయి. ముఖ్యంగా అనకాపల్లిలో రెన్యూ ఏపీ గ్రీన్ డేటా సెంటర్‌కు రూ.85,200 కోట్లు, విశాఖలో డేటా సెంటర్ హోల్డింగ్స్ ఇండియాకు రూ.58,743 కోట్లు, ఏఎం ఇంటెలిజెన్స్ ల్యాబ్స్‌కు రూ.31,387 కోట్ల పెట్టుబడులకు ప్రతిపాదనలు ఉన్నాయి. కాకినాడలో వారీ క్లీన్ ఎనర్జీ సొల్యూషన్స్ రూ.15 వేల కోట్లు, కర్నూలులో అగస్త్యా గ్రీన్ ఎనర్జీ రూ.7,799 కోట్లకు పైగా పెట్టుబడులు పెట్టనున్నాయి.కడప కొప్పర్తి క్లస్టర్‌లో ఏఐఎల్ డిక్సన్ రూ.450 కోట్ల పెట్టుబడితో ఏకంగా 7 వేల మందికి ఉద్యోగాలు కల్పించనుంది. నెల్లూరు మనుబోలులో వీపీఆర్ మైనింగ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ రూ.500 కోట్లతో 2 వేల మందికి ఉపాధి కల్పించనుంది. ప్రిసోల్ ఆగ్రో ఇండస్ట్రీస్ రూ.330 కోట్లకుపైగా పెట్టుబడితో 1,110 మందికి ఉద్యోగాలు ఇవ్వనుంది. మునోత్ లిథియం బ్యాటరీ, గ్రీన్ ఎనర్జీ, బయోగ్యాస్, డేటా సెంటర్లు, హోటల్స్, లాజిస్టిక్స్, ఆగ్రో, మైనింగ్ రంగాల్లోనూ పలు ప్రాజెక్టులు ఏర్పాటు కానున్నాయి. మొత్తంగా ఈ 25 ప్రాజెక్టుల ద్వారా రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లో పెట్టుబడులతో పాటు భారీగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు అందుబాటులోకి రానున్నాయి.

## జెన్-జీకి ప్రధాని నరేంద్రమోదీ కీలక సూచన



**మొదటిపేజీ తరువాయి -** అదే సమయంలో, సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లు, రీల్స్ విషయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. బుధవారం నాడు ఢిల్లీలో మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ ఆత్మకథ 'ట్రయంఫ్ ఆఫ్ ది ఇండియన్ రిపబ్లిక్: మై లైఫ్, మై స్ట్రగుల్స్' ఆవిష్కరణ కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు.రైల్వే స్టేషన్లలో తరచూ కనిపించే ఒక హెచ్చరికను ప్రధాని ఈ సందర్భంగా గుర్తుచేశారు. "షార్ట్‌కట్ విల్ కట్ యు షార్ట్" (అడ్డదారి మీ జీవితాన్ని కుదిస్తుంది) అనే బోర్డు కేవలం రైల్వే ట్రాక్‌లకే కాకుండా, నిజ జీవితానికి కూడా వర్తిస్తుందని ఆయన పేర్కొన్నారు. ఫుట్ ఓవర్ బ్రిడ్జిలు అందుబాటులో ఉన్నప్పటికీ, త్వరగా వెళ్లాలనే తొందరలో కొందరు ప్రమాదకరంగా పట్టాలు దాటుతుంటారని, అటువంటి అనాలోచిత నిర్ణయాలు ప్రాణాంతకమని ఆయన హెచ్చరించారు.యువత తప్పుడు మార్గాలను వీడి, అర్థవంతమైన జీవన గమనాన్ని ఎంచుకోవాలని ప్రధాని మోదీ సూచించారు. "మీరు ఆరాధించే మహనీయుల జీవిత చరిత్రలను తప్పనిసరిగా చదవండి. వాటి ద్వారా స్ఫూర్తి పొంది సరైన మార్గాన్ని కనుగొనవచ్చు" అని ఆయన యువతకు సలహా ఇచ్చారు. ముఖ్యంగా ఆలోచనా విధానాన్ని ప్రభావితం చేసే ఇన్‌ఫ్లుయెన్సర్ల కంటెంట్ పట్ల నిరంతరం జాగ్రత్తగా ఉండాలని ఆయన హితవు పలికారు.

## ఝార్ఖండ్ ప్రభుత్వానికి కాంగ్రెస్ మద్దతు



**మొదటిపేజీ తరువాయి -** రాష్ట్ర ప్రభుత్వం తగిన చర్యలు తీసుకుందని వెల్లడించారు. రాష్ట్ర సీఐడీ విచారణకు బదులుగా సీబీఐ దర్యాప్తును బీజేపీ డిమాండ్ చేయడం వెనుక ఎగ్జామ్ మాఫియాను రక్షించాలనే దురుద్దేశం ఉందని వారు మండిపడ్డారు. గతంలో అధికారంలో ఉన్నప్పుడు బీజేపీ ప్రభుత్వం యువత గొంతు నొక్కిందని వారు విమర్శించారు.2015 నుంచి దేశవ్యాప్తంగా బీజేపీ పాలనలో 152 పేపర్ లీకేజీలు జరిగితే, సీబీఐ కేవలం 17 కేసులనే మాత్రమే విచారించిందని, వాటిలో ఒక్క కేసులోనూ శిక్షలు పడలేదని కాంగ్రెస్ గణాంకాలను ఉదహరించింది. కేంద్రం ఒత్తిడితోనే ఝార్ఖండ్ బీజేపీ నేతలు వ్యవహరిస్తున్నారని, ఆగస్టు 10న శాంతియుతంగా సాగుతున్న నిరసనలను పక్కదారి పట్టించేందుకు బయటి వ్యక్తులను రంగంలోకి దించారని ఆరోపించింది.మరోవైపు, జేఎస్ఎస్సీ-సీజీఎల్ పరీక్షను రద్దు చేయాలని, జేపీఎస్సీ, జేఎస్ఎస్సీ నియామకాల్లోని అవకతవకలపై సీబీఐ విచారణ జరిపించాలని కోరుతూ విద్యార్థులు నిరసనలు కొనసాగిస్తున్నారు. అసెంబ్లీ ముట్టడికి యత్నించిన విద్యార్థులపై పోలీసులు వాటర్ కేనన్లు ప్రయోగించడంతో పాటు బలప్రయోగం చేయడంతో ఉద్రిక్తత నెలకొంది. తాము విద్యార్థులతో సంప్రదింపులు జరుపుతున్నామని, వారి డిమాండ్లలో చాలావరకు అంగీకరించామని ప్రభుత్వం పేర్కొంటుండగా, విద్యార్థులు మాత్రం ఈ వాదనను తోసిపుచ్చుతూ తమ పోరాటాన్ని సాగిస్తున్నారు.

# రాజ్యసభను కుదిపేసిన "లుంగీవాలా" వివాదం

**మొదటిపేజీ తరువాయి -** సభ్యుడు జాన్ బ్రిట్టాస్ ఆరోపించడంతో సభలో గందరగోళం నెలకొంది. ఈ నేపథ్యంలో చైర్మన్ సి.పి. రాధాకృష్ణన్ సభను మధ్యాహ్నానికి వాయిదా వేశారు.సోమవారం నాడు సభలో తాను ఆదాయపు పన్ను సవరణ ఆర్డినెన్స్‌కు వ్యతిరేకంగా తీర్మానాన్ని ప్రవేశపెడుతున్న సమయంలో, పంచె కట్టుకుని ఉన్న తనను చూసి వెనుక సీటులో కూర్చున్న సుస్మితా దేవ్ పదేపదే 'లుంగీవాలా' అని సంబోధించారని బ్రిట్టాస్ సభ దృష్టికి తీసుకొచ్చారు. ఇది దక్షిణాది సంస్కృతిని, మలయాళీలను అవమానించడమేనని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. తాను గర్వించదగ్గ భారతీయుడినని, దక్షిణాది వాడినని పేర్కొంటూ, ఈ వ్యాఖ్యలపై సుస్మితా దేవ్‌పై హక్కుల ఉల్లంఘన నోటీసు ఇచ్చినట్లు వెల్లడించారు.ఈ ఆరోపణలను సుస్మితా దేవ్ తీవ్రంగా ఖండించారు.



తాను అసోంకు చెందిన బెంగాలీనని, వివిధ రాష్ట్రాల వస్త్రధారణ పట్ల తనకు అపారమైన గౌరవం ఉందని స్పష్టం చేశారు. బ్రిట్టాస్ అసత్యాలు చెబుతున్నారని, ఏ విచారణలోనైనా వాస్తవాలు వెలుగులోకి వస్తాయని ఆమె పేర్కొన్నారు. అంతేకాకుండా, మతపరమైన గుర్తింపులపై బ్రిట్టాస్ అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ ఆయనపై ఆమె కూడా ప్రివిలేజ్ నోటీసు దాఖలు చేశారు.ఈ వివాదంపై ప్రతిపక్షాలు తీవ్ర నిరసన వ్యక్తం చేశాయి. కొందరు ఎంపీలు పార్లమెంట్ వెలుపల పంచెకట్టుతో నిరసన తెలిపారు. సభా నాయకుడు జె.పి. నడ్డా, పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు జోక్యం చేసుకుని, సభా మర్యాదలను కాపాడాలని సభ్యులను కోరారు. సభ్యులు ఒకరి సాంస్కృతిక సంప్రదాయాలను కించపరిచేలా వ్యాఖ్యలు చేయవద్దని సూచించిన చైర్మన్, ఇరుపక్షాలను తన ఛాంబర్‌కు పిలిచి సమస్య పరిష్కారానికి ప్రయత్నించారు. ప్రస్తుతం ఇరుపక్షాలు అందజేసిన హక్కుల ఉల్లంఘన నోటీసులు చైర్మన్ పరిశీలనలో ఉన్నాయి.

## సుందిళ్ల, అన్నారం, మేడిగడ్డ విషయంలో ఎన్‌డీఎస్‌ఏ సూచనలు పాటించాలి

**మొదటిపేజీ తరువాయి -** రూపొందించాలని సీఎం ఆదేశించారు. తక్షణ ప్రభావం పడే గ్రామాలకు వెంటనే పరిహారం చెల్లించాలని సీఎం సూచించారు. ఈ పనులు పూర్తయితే బస్వాపూర్, గౌరవెల్లి ప్రాజెక్టుల్లో నీరు నింపే అవకాశం ఉంటుందని సీఎం తెలిపారు. గట్టు, గూడెందొడ్డి ఎత్తిపోతల సామర్థ్యం పెంపునకు సంబంధించి సమగ్ర అధ్యయనం చేయాలని సీఎం రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. గూడెందొడ్డి పంప్డ్ స్టోరేజీ ప్రాజెక్టుకు సంబంధించి కన్సల్టెంట్‌ను నియమించాలని ముఖ్యమంత్రి సూచించారు."నీటిపారుదల శాఖపై నిర్వహించిన సమీక్షలో పాల్గొని ప్రాజెక్టుల పురోగతిపై అధికారులతో చర్చించాను. పెండింగ్ పనులను వేగవంతం చేయడంతో పాటు, నీటి లభ్యత, ప్రాజెక్టుల నిర్వహణ, భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా చేపట్టాల్సిన చర్యలపై సమీక్షించాను. రైతులకు సాగునీరు అందేలా, ప్రతి ఎకరాకు నీటి భరోసా కల్పించే దిశగా సమన్వయంతో పనిచేయాలని అధికారులకు సూచించాను. తెలంగాణ రైతాంగానికి సాగునీటి భద్రత కల్పిస్తూ, రాష్ట్ర వ్యవసాయ రంగాన్ని మరింత బలోపేతం చేయడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యం" - సీఎం రేవంత్ రెడ్డి ట్వీట్.మిల్లర్ల నుంచి ధాన్యం బకాయిలు వసూలు చేయాల్సిందేనని రేవంత్ రెడ్డి ఆదేశించారు. ధాన్యం బకాయిల విలువకు సమానమైన సొమ్ము వసూలు చేయాలని అధికారులకు సీఎం స్పష్టం చేశారు. వ్యాపార దృక్పథంతో మిల్లులు నడిపే వారితో సానుకూలంగా ఉంటామని, ఉద్దేశపూర్వకంగా ఎగవేస్తే వారి పట్ల కఠినంగా వ్యవహరిస్తామని సీఎం హెచ్చరించారు.గత ప్రభుత్వం వేల కోట్ల రూపాయల బకాయిలకు అవకాశం ఇచ్చి, తిరిగి ఆ తప్పును తమ ప్రభుత్వానికి అంటగట్టే ప్రయత్నం చేస్తోందని సీఎం మండిపడ్డారు. ఇప్పటికే బకాయిల వసూలులో కొంత పురోగతి ఉందన్న సీఎం, ప్రతీ ధాన్యం గింజకు సంబంధించిన బకాయి వసూలు చేయాల్సిందేనన్నారు. బకాయిల వసూలు కోసం విధివిధానాలు రూపొందించాలని అధికారులను సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. విధివిధానాలపై మంత్రివర్గ ఉపసంఘం చర్చించి ప్రభుత్వానికి నివేదిక సమర్పించాలన్నారు.మిల్లింగ్ బాధ్యతలను మహిళా సంఘాలకు అప్పగిస్తామని రేవంత్ రెడ్డి తెలిపారు. ప్రతీ సీజన్‌లో ధాన్యం నిల్వకు ఇబ్బందులు ఎదురవుతున్నందున ఇప్పటి నుంచే తగిన కార్యాచరణ రూపొందించాలని అధికారులకు సూచించారు. ధాన్యం దిగుబడి ఎక్కువగా వచ్చే నల్గొండ, సూర్యాపేట, నిజామాబాద్, పెద్దపల్లి, కామారెడ్డి జిల్లాల్లో సైలో బ్యాగ్ నిర్మాణాలను పైలెట్ ప్రాజెక్టు కింద చేపట్టాలని ఆదేశించారు. స్వయం సహాయక సంఘాలకు సైలో బ్యాగ్ నిర్మాణాల కోసం నియోజకవర్గానికి 50 నుంచి 100 ఎకరాల భూమిని కేటాయిస్తామని సీఎం తెలిపారు. దీనిపై రెవెన్యూ, పౌరసరఫరాలు, మహిళా సంక్షేమ శాఖల మంత్రులతో సమావేశం ఏర్పాటు చేస్తామన్నారు. మార్కెట్‌లో ఉన్న గోడౌన్‌లను పూర్తి స్థాయిలో వినియోగించుకోవాలని సీఎం సూచించారు. మహిళ సంఘాలకు గోదాములు నిర్మించాలన్న సీఎం, పైలట్ ప్రాజెక్టుగా 5 నియోజకవర్గాల్లో మహిళా సంఘాలకు గోదాములు నిర్మించాలన్నారు.వీబీ జీ రామ్‌జీలో ఫ్లాట్‌పాంల నిర్మాణానికి అవకాశం ఉన్నందున, విశాలమైన ఫ్లాట్‌పాంలు నిర్మించి జర్మన్ టెంట్లతో ధాన్యం నిల్వ చేసే అవకాశాలను పరిశీలించాలని సీఎం సూచించారు. మండల, గ్రామ స్థాయిలో ఉన్న ప్రైవేటు గోదాములు, ధాన్యం నిల్వకు ఉపయోగపడే కల్యాణ మండపాలు, పాత థియేటర్లు, ఇతర షెడ్లను ముందుగానే గుర్తించి ధాన్యం నిల్వకు లీజుకు తీసుకోవాలని సీఎం సూచించారు. సమీక్షలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఉన్నతాధికారులు శేషాద్రి, స్టీఫెన్ రవీంద్ర, రైస్ మిల్లర్ల సంఘం ప్రతినిధి తూడి దేవేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# డియర్ యంగ్ ఫ్రెండ్స్

**మొదటిపేజీ తరువాయి -** యువతను ఉద్దేశించి మాట్లాడుతూ.. "ప్రియమైన యువ మిత్రులారా, మీరే మా శక్తి. మీరే మా బలం. రేపటి ఆశ, వాగ్దానం మీరే" అని పేర్కొన్నారు. ప్రతి యువతీ యువకుడు తమకు నచ్చిన మార్గాన్ని ఎంచుకుని, ఆశించిన జీవితాన్ని గడిపేందుకు అవసరమైన స్వేచ్ఛ, ఆత్మవిశ్వాసం, అవకాశాలు కల్పించే భవిష్యత్తును నిర్మించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని పునరుద్ఘాటించారు. యువత కలలు కనడమే కాకుండా, వాటిని సాకారం చేసుకునేందుకు పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు."మేము ఈ రోజు చేస్తున్న ప్రతి పని అంతిమంగా మీకు మెరుగైన రేపటిని అందించడం కోసమే. విస్తృత అవకాశాలు, కలలు కనే స్వేచ్ఛ, వాటిని నిజం చేసుకునేందుకు అవసరమైన మద్దతుతో కూడిన భవిష్యత్తును అందించడమే మా ధ్యేయం" అని చంద్రబాబు వివరించారు.ఈ భవిష్యత్ నిర్మాణంలో యువత కూడా భాగస్వాములు కావాలని, అందరం కలిసికట్టుగా నవ సమాజాన్ని నిర్మిద్దామని ఆయన పిలుపునిచ్చారు. యువతకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలుపుతూ, ఈ భవిష్యత్తును తీర్చిదిద్దడంలో తనతో కలిసి రావాలని ఆహ్వానించారు.

## వై.ఎస్.జగన్ నేడు కర్నూలు జిల్లా పర్యటన

**మొదటిపేజీ తరువాయి -** కక్షపూరితంగా అక్రమ కేసులు బనాయిస్తూ, వేధింపులకు గురిచేస్తున్నారని వైసీపీ ఆరోపిస్తున్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలోనే ఇటీవల అరెస్ట్ అయి రిమాండ్ లో ఉన్న ఆలూరు మాజీ ఎమ్మెల్యే విరూపాక్షి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పేందుకు, వారికి అండగా నిలిచేందుకు జగన్ ఈ పర్యటన చేపడుతున్నారు. పర్యటనలో భాగంగా కర్నూలు జిల్లా జైలులో ఉన్న పార్టీ నాయకులను జగన్ పరామర్శించనున్నారు. పార్టీ శ్రేణులకు ధైర్యం చెప్పబోతున్నారు. వైసీపీ శ్రేణులకు ఏ చిన్న కష్టం వచ్చినా వైసీపీ అగ్రనాయకత్వం పూర్తి స్థాయిలో అండగా ఉంటుందని... చట్టపరంగా, పోరాటాల ద్వారా ఈ కక్షసాధింపు చర్యలను తిప్పికొడతామని చెప్పడమే ఈ పర్యటన ముఖ్య ఉద్దేశమని పార్టీ వర్గాలు వెల్లడించాయి.

## కర్ణాటకలో గుట్కా, పాన్‌మసాలాపై నిషేధం

**మొదటిపేజీ తరువాయి -** దృష్టిలో పెట్టుకుని ఫుడ్ సేఫ్టీ కమిషనరేట్ ఈ ఉత్తర్వులు జారీ చేసింది. ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ చట్టం 2006, సంబంధిత రెగ్యులేషన్ల కింద ఈ నిషేధం అమలులోకి వచ్చింది. పొగాకు లేదా నికోటిన్ ఉన్న గుట్కా, పాన్‌మసాలా మాత్రమే కాకుండా... ఏ పేరుతో అయినా అమ్ముతున్న ఇలాంటి ఉత్పత్తులు, ప్యాక్డ్ లేదా అన్‌ప్యాక్డ్ ఉత్పత్తులపై కూడా ఈ నిషేధం వర్తిస్తుంది.ఫుడ్ సేఫ్టీ అధికారులు రాష్ట్ర వ్యాప్తంగా ప్రత్యేక తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఉల్లంఘనలు జరిగితే కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు స్పష్టం చేశారు. గతంలో ముఖ్యమంత్రి డీకే శివకుమార్ కూడా ఇలాంటి ఉత్పత్తుల్లో మాదకద్రవ్యాలు కలపడం జరుగుతోందని హెచ్చరించి, డ్రగ్-ఫ్రీ కర్ణాటక లక్ష్యంగా ముందుకు వెళతామని ప్రకటించిన సంగతి తెలిసిందే.

## తెలంగాణలో నేడు 'ఉచిత ఆటోమేటిక్ కుట్టు మిషన్ల' పథకం ప్రారంభం

**మొదటిపేజీ తరువాయి -** ఆటోమేటిక్ కుట్టు మిషన్లు పంపిణీ చేసే సరికొత్త సంక్షేమ పథకాన్ని రేపు అధికారికంగా ప్రారంభించనున్నట్లు బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రకటించారు. శ్రమను తగ్గించి, వేగంగా పని చేసుకునేందుకు వీలుగా ఈ అధునాతన ఆటోమేటిక్ మిషన్లను అందించబోతున్నారు.ఈ పథకం కింద రాష్ట్రంలోని ప్రతి నియోజకవర్గంలో వెయ్యి మంది మహిళలకు మిషన్లు అందించబోతున్నారు. లబ్ధిదారుల వయోపరిమితి, కుటుంబ వార్షిక ఆదాయ పరిమితి, అవసరమయ్యే కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాల వివరాలను మంత్రి రేపు అధికారికంగా వెల్లడిస్తారు. ఆన్‌లైన్, మీ-సేవ కేంద్రాల ద్వారా దరఖాస్తులు స్వీకరించే తేదీలను, ప్రక్రియ మార్గదర్శకాలను ప్రకటించనున్నారు.

# మేం 'టీ-హబ్' కడితే.. రేవంత్ 'అనుముల హబ్' కడుతున్నారు

**మొదటిపేజీ తరువాయి -**

రెడ్డిపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు తన విమర్శల దాడిని మరింత ఉద్ధృతం చేశారు. సీఎం సోదరుడికి సంబంధముందని ఆరోపిస్తున్న టెస్సారక్ట్ అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ ప్రైవేట్ లిమిటెడ్‌కు భూ కేటాయింపుల విషయంలో రూ. 200 కోట్ల కుంభకోణం జరిగిందని ఆరోపిస్తూ, సీఎం రేవంత్ రెడ్డి 'అనుముల హబ్స్' ఏర్పాటులో బిజీగా ఉన్నారని ఆయన ఎద్దేవా చేశారు.బుధవారం ఈ అంశంపై 'ఎక్స్' (ట్విట్టర్) వేదికగా కేటీఆర్ స్పందించారు. "తాము నిజమైన స్టార్టప్‌ల అభివృద్ధి కోసం టీ-హబ్ నిర్మిస్తే, రేవంత్ రెడ్డి మాత్రం కుటుంబ సభ్యులతో నడిచే, సున్నా ఆవిష్కరణలు, సున్నా ఉద్యోగులతో కూడిన స్కామ్.. అదేనండీ స్కీమ్ అయిన 'అనుముల హబ్స్' సృష్టిస్తున్నారు. అనుముల సోదరుల్లో ఒకరైతే చాలు, ఎలాంటి ప్రశ్నలు లేకుండా చౌక ధరకే ప్రభుత్వ భూమిని కేటాయిస్తారు. సున్నా పెట్టుబడితో రాత్రికి రాత్రే రూ. 200 కోట్లు సంపాదించినందుకు అనుముల కొండల్ రెడ్డిని 'శతాబ్దపు ఆవిష్కర్త'గా ప్రకటించాలి" అని కేటీఆర్ తన పోస్టులో పేర్కొన్నారు .కేవలం రూ. లక్ష చెల్లింపు మూలధనం, సున్నా ఉద్యోగులు ఉన్న కంపెనీకి అత్యంత విలువైన ప్రభుత్వ భూమిని ఎలా కేటాయిస్తారని ఆయన ప్రశ్నించారు. సుమారు రూ. 200 కోట్ల విలువైన ఐదు ఎకరాల భూమిని కేవలం రూ. 7 కోట్లకే, అంటే గజం రూ. 3,700 చొప్పున కట్టబెట్టారని కేటీఆర్ ఆరోపించారు. ప్రభుత్వ భూముల నుంచి కోట్లాది రూపాయలు సంపాదించే ఈ మ్యాజిక్ ట్రిక్‌ను కేవలం అనుముల కుటుంబానికే పరిమితం చేయకుండా తెలంగాణ



యువతకు కూడా నేర్పించాలని మంత్రి శ్రీధర్ బాబు, సీఎం రేవంత్ రెడ్డిలను ఉద్దేశించి అన్నారు.టెస్సారక్ట్ సంస్థతో సీఎం సోదరుడికి ఎలాంటి సంబంధం లేదని మంత్రి శ్రీధర్ బాబు చేసిన ప్రకటనను కేటీఆర్ తప్పుబట్టారు. కొండల్ రెడ్డి లింక్డ్‌ఇన్ ప్రొఫైల్‌లో, యూఎస్-ఇండియా స్ట్రాటజిక్ పార్ట్‌నర్‌షిప్ ఫోరమ్‌లో ఆయన్ను టెస్సారక్ట్ ఛైర్మన్‌గా గుర్తించిన విషయాన్ని కేటీఆర్ గుర్తుచేశారు. ఈ భూ కేటాయింపులకు సంబంధించిన జీవో, భూమి విలువ, అర్హత ప్రమాణాలు, పెట్టుబడి ప్రతిపాదనలు వంటి అన్ని పత్రాలను ప్రభుత్వం వెంటనే బయటపెట్టాలని ఆయన డిమాండ్ చేశారు.ఈ భూ కేటాయింపుల వ్యవహారంపై సమగ్ర విచారణ జరపాలని, దీనిపై ముందుగా గవర్నర్‌కు ఫిర్యాదు చేసి, అవసరమైతే లోకాయుక్తను, న్యాయస్థానాలను ఆశ్రయిస్తామని కేటీఆర్ స్పష్టం చేశారు. వాస్తవాలు వెలుగులోకి వచ్చి, బాధ్యులను శిక్షించే వరకు ఈ అంశాన్ని వదిలిపెట్టబోమని ఆయన స్పష్టం చేశారు.

# బ్లూ కోల్ట్, పెట్రో కార్ సిబ్బంది విధుల్లో అప్రమత్తంగా ఉండాలి-జిల్లా ఎస్పీ అశోక్ కుమార్

**ప్రజలకు వేగవంతమైన, సమర్థవంతమైన సేవలు అందించాలి**



**జగిత్యాల జిల్లా ప్రతినిధి, ( ప్రజా మంటలు) ఆగస్ట్ 12:** ప్రజలకు పోలీస్ సేవలు మరింత వేగంగా, సమర్థవంతంగా అందించేందుకు సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా విధులు నిర్వహించాలని జగిత్యాల ఎస్పీ అశోక్ కుమారు కోరారు. బుధవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో బ్లూ కోల్ట్, పెట్రో కార్ సిబ్బందితో ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పి మాట్లాడుతూ.. బ్లూ కోల్ట్, పెట్రో కార్స్ సిబ్బంది విజిబుల్ పోలీసింగ్, అత్యవసర స్పందన, నేర నియంత్రణ, నేరస్తులపై నిఘా, కమ్యూనిటీ పోలీసింగ్‌లో కీలక పాత్ర పోషించాలని సూచించారు. హాట్‌స్పాట్‌ల వద్ద పెట్రోల్ వాహనాలను కొద్దిసేపు నిలిపి, అపరిచిత వ్యక్తులు, అనుమానాస్పద వాహనాలు, కదలికలను నిశితంగా పరిశీలించాలని సూచించారు. ముఖ్యంగా బ్యాంకులు, ఏటీఎంల వద్ద అనుమానాస్పద వ్యక్తులు, వాహనాల కదలికలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు.

**డయల్ 112 కాల్స్‌కు తక్షణశీ స్పందించాలి:**

కంట్రోల్ రూమ్, పోలీస్ స్టేషన్, డయల్ -112 లేదా ప్రజల నుంచి అత్యవసర సమాచారం అందిన వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని బాధితులకు తక్షణ సహాయం అందించాలన్నారు. క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించడం, బాధితులు, సాక్షుల నుంచి సమాచారం సేకరించడం వంటి చర్యలను వెంటనే చేపట్టాలని సూచించారు. బ్యాంకులు, ఎటీఎం ల వద్ద అనుమానాస్పద వ్యక్తులు, వాహనాల కదలికలను నిశితంగా పరిశీలించాలని సూచించారు. రౌడీషీటర్లు, డిసిఎస్, కెడీఎస్, అనుమానితులు, ఆస్తి సంబంధిత నేరస్తులు, దొంగసొత్తు కొనుగోలు చేసే వ్యక్తులు, తరచూ నేరాలకు పాల్పడే వ్యక్తుల కదలికలపై నిరంతరం నిఘా కొనసాగించాలని సూచించారు. కమ్యూనిటీ పోలీసింగ్‌కు ప్రాధాన్యత పాఠశాలలు, కళాశాలలు, కాలనీలు, రెసిడెంట్ అసోసియేషన్లు, వ్యాపార సంస్థలు, ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థలతో తరచూ కమ్యూనిటీ సమావేశాలు నిర్వహించాలని సూచించారు. ఇటీవల జరిగిన కొన్ని సంఘటనల్లో ఆత్మహత్యకు యత్నించిన వ్యక్తులను సకాలంలో గుర్తించి, వేగంగా స్పందించి వారి ప్రాణాలను కాపాడిన బ్లూ కోల్ట్, పెట్రోల్ కార్ సిబ్బందిని ఈ సందర్భంగా ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు. అత్యవసర పరిస్థితుల్లో అప్రమత్తతతో, సమయస్ఫూర్తితో వ్యవహరించి విలువైన ప్రాణాలను కాపాడటం అభినందనీయమని పేర్కొన్నారు. ఈ యొక్క సమావేశంలో డీసీఆర్బి డిఎస్పి రవి కుమార్, బ్లూ కోల్ట్ మరియు పెట్రో కార్ సిబ్బంది పాల్గొన్నారు.

# పోలీసుల అదుపులో ఇద్దరు గంజాయి విక్రేతలు

**60 గ్రాముల గంజాయి, స్కూటీ, రెండు సెల్ ఫోన్ లు స్వాధీనం**

**జగిత్యాల జిల్లా ప్రతినిధి, ( ప్రజా మంటలు ) ఆగస్ట్ 12;** జగిత్యాల జిల్లా మల్లాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని చిట్టాపూర్ గ్రామ శివారులో పౌల్ట్రీ ఫారం వద్ద గంజాయి విక్రయించేందుకు ప్రయత్నిస్తున్న ఇద్దరు వ్యక్తులను మల్లాపూర్ పోలీసు సిబ్బంది బుధవారం అదుపులోకి తీసుకొన్నట్లు ఎస్సై అనిల్ తెలిపారు. నిందితులను పోలీసులు విచారించి వారి నుండి 60 గ్రాముల గంజాయి, స్కూటీ, రెండు సెల్ ఫోన్లను స్వాధీనం చేసుకోవడం జరిగిందని ఆయన తెలిపారు. వారిని ఎంచురాల రిశిత్ రెడ్డి, తండ్రి: రాజిరెడ్డి, వయస్సు: 21 సంవత్సరాలు, కులం: గుడేటికాపు, వృత్తి: డెలివరీ బాయ్, ఇంకొకరు కొండగల్ల రాజ్ కుమార్, తండ్రి: లేట్ పెంటయ్య, వయస్సు: 24 సంవత్సరాలు, కులం: తెనుగు, ఇద్దరూ చిట్టాపూర్ గ్రామస్తులుగా పోలీసులు గుర్తించామన్నారు. విచారణలో నిందితులు ఇద్దరూ స్నేహితులని, గంజాయి సేవించే అలవాటు వారికిద్దరికీ ఉందని, తరచుగా కలిసి గంజాయి కొనుగోలు చేసి వినియోగిస్తూ, మిగిలిన గంజాయిని



ఇతరులకు విక్రయిస్తుంటామని వారు ఒప్పుకున్నట్లు ఎస్సై పేర్కొన్నారు. వీరికి మేడిపల్లి మండలం, వల్లంపల్లి గ్రామానికి చెందిన బాణాల అరవింద్, తండ్రి: రవి, వయస్సు: 19 సంవత్సరాలు, కులం: వీరముష్టి అనే వ్యక్తి తమ స్నేహితుల ద్వారా పరిచయం అయ్యాడని, అతని ద్వారా గంజాయి సేవించే అలవాటు ఏర్పడిందని వారు తెలిపినట్లు ఎస్సై తెలిపారు. మల్లాపూర్ మండలంలో గంజాయి లభించక పోవడంతో బాణాల అరవింద్ వద్ద గంజాయి కొనుగోలు చేసి, అందులో కొంత భాగాన్ని సేవించి, మిగిలిన గంజాయిని ఎవరికీ తెలియకుండా విక్రయించేందుకు రిశిత్ రెడ్డి తన డియో స్కూటీలో పెట్టుకున్నట్లు విచారణలో వెల్లడించినట్లు పోలీసులు తెలిపారు. ఇద్దరూ స్కూటీపై చిట్టాపూర్ నుండి సిర్పూర్ వైపు వెళ్తుండగా, చిట్టాపూర్ గ్రామ శివారులోని పౌల్ట్రీ ఫారం వద్ద గంజాయి విక్రయించేందుకు ఆగిన సమయంలో వారిని అదుపులోకి తీసుకోవడం జరిగిందన్నారు. మల్లాపూర్ పోలీసులు అప్రమత్తంగా వ్యవహరించి, గంజాయి అక్రమ రవాణా, విక్రయాలను అరికట్టేందుకు నిరంతరం చర్యలు చేపడుతున్నట్లు ఆయన తెలిపారు. నిందితులపై చట్టపరమైన చర్యలు తీసుకొని, కేసు దర్యాప్తు కొనసాగుతోందని ఎస్సై తెలిపారు .గంజాయి సేవించడం, విక్రయించడం, రవాణా చేయడం చట్టరీత్యా నేరం. యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, యువత వారి ఉజ్వల భవిష్యత్ ను నాశనం చేసుకోవద్దని ఎస్సై అనిల్ కోరారు.

# క్రీడలు స్నేహభావాన్ని పెంపొందిస్తాయి

**సీనియర్ సివిల్ జడ్జి డి. నాగేశ్వర్ రావు**



**మెట్‌పల్లి, ఆగస్టు 12 (ప్రజా మంటలు):** క్రీడలు ఆడటం వల్ల స్నేహభావం పెంపొందడంతో పాటు మానసిక ఉల్లాసం కలుగుతుందని మెట్‌పల్లి ఇన్‌చార్జి సీనియర్ సివిల్ జడ్జి డి. నాగేశ్వర్ రావు అన్నారు. స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రీడా పోటీలను బుధవారం జూనియర్ సివిల్ జడ్జి వినుకొండ మాధవితో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా జడ్జి నాగేశ్వర్ రావు మాట్లాడుతూ.. క్రీడలు మానసిక ఉల్లాసానికి ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. కేవలం పోటీల సమయంలోనే కాకుండా రోజువారీ జీవితంలోనూ క్రీడలను భాగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఏలేటి రాంరెడ్డి, ప్రధాన కార్యదర్శి నల్ల రాజేందర్, ఏపీపీ చెర్లపల్లి ఆనంద్ గౌడ్, ఏపీపీ జి. ప్రణయ్, ఏజీపీ అబ్దుల్ హాఫీజ్, క్రీడా కార్యదర్శి నీరటి రమణతో పాటు పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.

# నిజాంపేట్‌లో వైభవంగా అమ్మవారి బోనాలు

**భక్తిశ్రద్ధలతో మొక్కులు చెల్లించుకున్న మహిళలు**



**సికింద్రాబాద్, ఆగస్టు 12 ( ప్రజామంటలు):** నిజాంపేట్ బండారి లేఔట్‌లోని నల్ల పోచమ్మ దేవాలయం నుంచి మహంకాళి జాతర, బోనాల ఉత్సవాలు అత్యంత వైభవంగా జరిగాయి. సాంప్రదాయ దుస్తులు ధరించిన మహిళలు భక్తిశ్రద్ధలతో బోనాలను తలపై ఎత్తుకుని ఊరేగింపుగా తరలివచ్చి అమ్మవారికి సమర్పించి తమ మొక్కులు తీర్చుకున్నారు. మంగళవాయిద్యాలు, పోతురాజుల విన్యాసాలు, శివసత్తుల పూనకాలతో ఆలయ ప్రాంగణమంతా ఆధ్యాత్మిక శోభతో కలకలలాడింది. ఈ వేడుకల్లో భారతీయ జనతా పార్టీ ఓబీసీ నిజాంపేట్ అధ్యక్షుడు పి. వెంకటేశ్వర్ ముదిరాజ్‌తో పాటు పలువురు స్థానిక రాజకీయ నాయకులు, ప్రముఖులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉత్సవాలకు విచ్చేసిన భక్తులకు స్వాగతం పలికిన నాయకులు, దర్శనానికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని రకాల సౌకర్యాలను దగ్గరుండి ఏర్పాటు చేశారు.

# 'హర్ ఘర్ తిరంగా'లో పోలీసులు భాగస్వామ్యమై దేశభక్తిని చాటాలి

**బండ కార్తీకరెడ్డి**



**సికింద్రాబాద్, ఆగస్టు 12 ( ప్రజామంటలు):** కేంద్ర ప్రభుత్వం పిలుపునిచ్చిన 'హర్‌ఘర్ తిరంగా' కార్యక్రమంలో పోలీసులు భాగస్వామ్యమై దేశభక్తి స్ఫూర్తిని చాటుకోవాలని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు బండ కార్తీక చంద్రారెడ్డి పిలుపునిచ్చారు. ఈ నెల 10 నుంచి 14 వరకు నిర్వహించనున్న ఈ యాత్రను పురస్కరించుకుని సికింద్రాబాద్ నియోజకవర్గం పరిధిలోని ఉస్మానియా యూనివర్సిటీ, వారసిగూడ, చిలకలగూడ, అడ్డగుట్ట, లాలగూడా పోలీస్ స్టేషన్లను ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా అక్కడి పోలీసు అధికారులకు, సిబ్బందికి జాతీయ జెండాలను అందజేశారు. పోలీస్ శాఖ అధికారులు, సిబ్బంది అందరూ తమ ఇళ్లపై త్రివర్ణ పతాకాన్ని ఎగురవేసి 'హర్‌ఘర్ తిరంగా యాత్ర'లో ఉత్సాహంగా పాల్గొనాలని ఆమె కోరారు. ప్రజా రక్షణలో నిరంతరం శ్రమిస్తున్న పోలీసులు ఈ వేడుకల్లో స్వచ్ఛందంగా పాల్గొనడం ద్వారా సమాజంలో మరింత దేశభక్తి స్ఫూర్తి నిండుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# జగిత్యాలలో రవాణా శాఖ అధికారుల తనిఖీలు

**జగిత్యాల జిల్లా ప్రతినిధి, ( ప్రజా మంటలు) ఆగస్ట్ 12:** జగిత్యాల జిల్లా కేంద్రంలోని కొత్త బస్‌స్టాండ్ చౌరస్తా వద్ద జిల్లా రవాణా శాఖ అధికారులు బుధవారం విస్తృతంగా వాహన తనిఖీలు నిర్వహించారు. జిల్లా రవాణా శాఖ అధికారి సందాని మహమ్మద్ ఆధ్వర్యంలో చేపట్టిన ఈ తనిఖీల్లో వాహనాల పత్రాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ తనిఖీల్లో సరైన పత్రాలు లేని 21 వాహనాలపై కేసులు నమోదు చేసి, వాటిని డిపోకు తరలించారు. ఈ సందర్భంగా జిల్లా రవాణా శాఖ అధికారి సందాని మహమ్మద్ మాట్లాడుతూ ప్రతి వాహనానికి తప్పనిసరిగా ఫిట్‌నెస్, ఇన్సూరెన్స్, పర్మిట్ పత్రాలు ఉండాలని సూచించారు. అలాగే చెల్లుబాటు అయ్యే



డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా ఎవరూ వాహనాలు నడపరాదని తెలిపారు. వాహనదారులు అన్ని రకాల పత్రాలను సక్రమంగా కలిగి ఉండాలని, రోడ్డు భద్రతా నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని ఆయన సూచించారు. ఈ తనిఖీల్లో జిల్లా రవాణా శాఖ అధికారి సందాని మహమ్మద్, ఎంవీఐలు రామారావు, సాయి చరణ్ తోపాటు రవాణా శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

# అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలి

**నిర్ణీత గడువులోగా పనులు పూర్తి చేయాలి**

**రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్**

**పాల్గొన్న జిల్లా కలెక్టర్ బి.సత్య ప్రసాద్**



**జగిత్యాల జిల్లా ప్రతినిధి, ( ప్రజా మంటలు) ఆగస్టు 12 :** ధర్మపురి అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో చేపడుతున్న అభివృద్ధి పనులను వేగవంతం చేసి నిర్ణీత గడువులో పూర్తి చేయాలని రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అధికారులను ఆదేశించారు. బుధవారం సమీకృత జిల్లా కలెక్టరేట్ లో జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ తో కలిసి సంబంధిత ఇంజనీరింగ్ అధికారులతో నియోజకవర్గ అభివృద్ధి పనుల పురోగతిపై మంత్రి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో అభివృద్ధి పనుల పురోగతి ఏమాత్రం సంతృప్తికరంగా లేదని, ప్రతి పనికి స్పష్టమైన షెడ్యూల్ రూపొందించుకుని నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని ఆదేశించారు. సంబంధిత ఇంజనీరింగ్ అధికారులు కాంట్రాక్టర్లతో నిరంతరం సమన్వయం చేసుకుంటూ పనులను వేగవంతం చేయాలన్నారు. క్షేత్రస్థాయిలో ఎదురయ్యే సమస్యలను తమ దృష్టికి తీసుకువస్తే వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. పనులను అనవసరంగా జాప్యం చేయవద్దని, కాంట్రాక్టర్లు సహకరించకపోతే వెంటనే చర్యలు తీసుకుని అవసరమైతే బ్లాక్‌లిస్ట్ చేయాలని స్పష్టం చేశారు. మంజూరైన అన్ని పనులకు టెండర్ ప్రక్రియను పూర్తి చేసి క్షేత్రస్థాయిలో పనులు ప్రారంభమయ్యేలా చూడాలన్నారు. రానున్న రోజుల్లో అభివృద్ధి పనుల్లో స్పష్టమైన మార్పు ప్రజలకు కనిపించాలని అన్నారు. సబ్ ప్లాన్ నిధులతో చేపట్టే రూ.5 లక్షల వరకు ఉన్న పనులను ఆలస్యం చేయకుండా స్థానిక ప్రజాప్రతినిధుల సమన్వయంతో వెంటనే ప్రారంభించాలని సూచించారు. ధర్మపురి నియోజకవర్గ అభివృద్ధి పనులను ప్రాధాన్యతా క్రమంలో పూర్తి చేయాలని, వచ్చే ఏడాది గోదావరి పుష్కరాలను దృష్టిలో ఉంచుకుని ధర్మపురి పట్టణంలో చేపట్టాల్సిన పనులకు ముందుగానే ప్రణాళిక రూపొందించి పూర్తి చేయాలని మంత్రి ఆదేశించారు. రోళ్ల వాగు షట్టర్ పనులను ఆగస్టు నెలాఖరులోగా పూర్తి చేయాలని, అక్కేపల్లి లిఫ్ట్ పనులను జనవరి 2027 నాటికి పూర్తి చేయాలని సూచించారు. అవసరమైన నిధులను ఎప్పటికప్పుడు విడుదల చేసేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. పెండింగ్ బిల్లుల వివరాలను తన దృష్టికి తీసుకువస్తే వెంటనే చెల్లింపులు జరిగేలా చర్యలు తీసుకుంటామని, పనులను త్వరగా పూర్తి చేయాలని మంత్రి తెలిపారు. ప్రాజెక్టులకు సంబంధించిన నిర్వహణ పనులను సీజన్ ప్రారంభానికి ముందే ప్రణాళికాబద్ధంగా చేపట్టి పూర్తి చేయాలని సూచించారు. యశ్వంతరావు పేట, రంగధాంపల్లి చెరువుల పనులకు సంబంధించిన అంచనాలను త్వరగా ఆమోదించి పనులు ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకోవాలని, కన్నంపల్లి లింక్ కాలువకు సంబంధించిన పెండింగ్ భూసేకరణ చెల్లింపులను త్వరలో పరిష్కరించి పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. ధర్మపురిలో రూ.3.14 కోట్లతో అభివృద్ధి చేస్తున్న కోరండపల్లి చెరువు పనులు ప్రస్తుతం 35 శాతం పూర్తయ్యాయని, బండ్ ఏర్పాటు, స్టోన్ పిచింగ్ పనులు పూర్తయ్యాయని తెలిపారు. మిగిలిన పునరుద్ధరణ పనులను నిర్ణీత షెడ్యూల్ ప్రకారం పూర్తి చేసి వచ్చే జూన్ 2027 నాటికి చెరువును నీటితో నింపేలా చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ పనులను వెంటనే ప్రారంభించి నిర్ణీత గడువులో పూర్తి చేయాలని సూచించారు. ధర్మపురిలో తొలి దశలో 2,756 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కాగా ఇప్పటివరకు 2,462 ఇళ్లకు మార్కింగ్ పూర్తయిందని తెలిపారు. మిగిలిన లబ్ధిదారులను అధికారులు నిరంతరం సంప్రదించాలని, ఇల్లు నిర్మించేందుకు ఆసక్తి చూపని లబ్ధిదారుల స్థానంలో అర్హులైన ఇతర లబ్ధిదారులను ఎంపిక చేయాలని సూచించారు. నిర్మాణానికి అవసరమైన పెట్టుబడి లేని లబ్ధిదారులకు స్వయం సహాయక సంఘాల ద్వారా రుణం అందించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ధర్మపురిలో 617 ఇళ్ల పూర్తయ్యాయని, 1,295 ఇళ్లు ఫినిషింగ్ దశలో ఉన్నాయని, మిగిలిన ఇళ్ల నిర్మాణాలపై కూడా నిరంతరం పర్యవేక్షణ చేయాలని మంత్రి ఆదేశించారు. రెండో దశలో ధర్మపురి ని గుడిసెలు లేని నియోజకవర్గంగా తీర్చిదిద్దాలని, ప్రతి గుడిసెకు ఇల్లు అందేలా చర్యలు తీసుకోవాలని, అర్హులైన పేదలకు పారదర్శకంగా ఇళ్లు మంజూరు చేయాలని సూచించారు. జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ మాట్లాడుతూ ధర్మపురి నియోజకవర్గంలో ఆర్‌డబీ శాఖ ఆధ్వర్యంలో రూ.463 కోట్ల విలువైన 26 పనులు మంజూరయ్యాయని తెలిపారు. వీటిలో రూ.19 కోట్ల బిల్లులు చెల్లించగా, రూ.11 కోట్ల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని వివరించారు. 10 పనులు పూర్తయ్యాయని, 12 పనులు పురోగతిలో ఉండగా, 2 పనులు ఇంకా ప్రారంభం కాలేదని తెలిపారు. పురోగతిలో ఉన్న పనులను త్వరగా పూర్తి చేసేలా ఇంజనీర్లు క్షేత్రస్థాయిలో నిరంతరం పర్యటించాలని, అవసరమైన చోట కార్మికుల సంఖ్యను పెంచాలని ఆదేశించారు. పంచాయతీరాజ్ శాఖ పరిధిలో గత సంవత్సరం చేపట్టిన, ప్రస్తుతం కొనసాగుతున్న ఉపాధి హామీ పనులను త్వరగా పూర్తి చేయాలని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో రూ.153 కోట్ల విలువైన 396 పనులు మంజూరు కాగా, రూ.31 కోట్ల విలువైన 96 పనులు పూర్తయ్యాయని వివరించారు. ఈ.జీ.ఎస్. కింద రూ.18 కోట్ల విలువైన 296 పనులు మంజూరు కాగా ఇప్పటివరకు రూ.4.6 కోట్ల మేర ఖర్చు జరిగిందని, గ్రౌండింగ్ అయిన అన్ని పనులను నిర్ణీత గడువులో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ధర్మపురి పట్టణంలో టీయూఎఫ్ఐడీసీ నిధులు రూ.12.85 కోట్లతో 8 అభివృద్ధి పనులు చేపట్టగా 5 పనులు పూర్తయ్యాయని, మరో పని ఫినిషింగ్ దశలో ఉందని తెలిపారు. షాపింగ్ కాంప్లెక్స్ టెండర్ దశలో ఉండగా, ప్రవేశ ద్వారాల నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని వివరించారు. ధర్మపురి పట్టణ తాగునీటి సరఫరా కోసం అమృత్ 2.0 కింద రూ.23 కోట్లతో చేపట్టిన పనుల్లో 22.2 కిలోమీటర్ల పైప్‌లైన్ లో 82 శాతం, 900 గృహ కనెక్షన్ల లో 77 శాతం పనులు పూర్తయ్యాయని తెలిపారు. ఈ పనులను డిసెంబర్ 2026 నాటికి పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. టీజీఈడబ్ల్యూఐడీసీ ఆధ్వర్యంలో మొత్తం 29 పనులకు రూ.234 కోట్ల విలువైన పనులు మంజూరు కాగా, ఇందులో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్‌కు రూ.200 కోట్లు కేటాయించామని కలెక్టర్ తెలిపారు. పీఎం శ్రీ పాఠశాలలు, మరమ్మతులు, భావిత కేంద్రాలకు సంబంధించిన 16 పనులు పూర్తయ్యాయని వివరించారు. ఈ సమీక్షలో అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు బి రాజ గౌడ్, సంబంధిత ఇంజనీరింగ్ శాఖల అధికారులు, ఎంపిడిఓ లు, మున్సిపల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# మార్కెట్ కమిటీ చైర్మన్ పరామర్శించిన నాగుర్ల వెంకటేశ్వర్లు



**ఎల్కతుర్తి ఆగస్టు 12 ప్రజా మంటలు :** ఎల్కతుర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ సుకినే సంతాజి ప్రమాదవశాత్తు కాలికి గాయం కావడంతో, ఎల్కతుర్తిలోని ఆయన నివాసానికి వెళ్లి తెలంగాణ రాష్ట్ర రైతు రుణ విమోచన కమిషన్ మాజీ చైర్మన్, ఆరె కుల సంక్షేమ సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షులు నాగుర్ల వెంకటేశ్వర్లు.. పరామర్శించారు. ఈ సందర్భంగా సంతాజి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని, త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ పరామర్శ కార్యక్రమంలో ఆరె కుల విద్యావంతుల వేదిక రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ మోటె చిరంజీవి,ప్రముఖ వ్యాపారవేత్త కౌడగాని రాంబాబు,నాయకులు హింగె భాస్కర్,జూపాక భాస్కర్, శంకర్, రాములు, శివాజీ తదితరులు పాల్గొన్నారు.

# ఎలక్ట్రిక్ ఆటోల ప్రతిపాదనను ఉపసంహరించుకోవాలి



**హైదరాబాద్, ఆగస్టు 12 (ప్రజా మంటలు):** ఆర్టీసీ ఆధ్వర్యంలో ఎలక్ట్రిక్ ఆటోలు నడపాలన్న ప్రతిపాదనను వెంటనే ఉపసంహరించుకోవాలని టీఆర్టీయూ అనుబంధ ఆటో కార్మిక సంఘం డిమాండ్ చేసింది. ఇందిరాపార్క్ ధర్నా చౌక్‌లో బుధవారం మహాధర్నా నిర్వహించి, జీవో 263ను రద్దు చేయాలని కోరుతూ 20 మంది ఆటో కార్మికులు దీక్ష చేపట్టారు. ఆటో డ్రైవర్ల జీవనోపాధిని దెబ్బతీసే చర్యలను ప్రభుత్వం చేపడితే తీవ్ర ఉద్యమం తప్పదని టీఆర్ఎస్ నేతలు రూప్ సింగ్, బోడ జనార్ధన్ హెచ్చరించారు. రాష్ట్రంలోని 5 లక్షల మంది ఆటో డ్రైవర్లకు అన్యాయం చేస్తే ఊరుకునేది లేదన్నారు.

# వానరానికి ( కోతికి) అంత్య క్రియలు

**పాల్గొన్న బుగ్గారం జిపి పాలక వర్గం, సిబ్బంది**





**బుగ్గారం / జగిత్యాల జిల్లా, ( ప్రజా మంటలు) ఆగస్ట్ 12:** కుక్కల దాడితో బుగ్గారం గ్రామంలో వానరం ( కోతి) చనిపోగా బుధవారం గ్రామ పంచాయతీ పాలక వర్గం ఆధ్వర్యంలో అంత్య క్రియలు నిర్వహించారు. బుగ్గారం సర్పంచ్ నక్క రాజవ్వ - రాజయ్య ల అధ్వర్యములో గ్రామ శివారున పూలు, పసుపు - కుంకుమ, అగర్ బత్తులతో ప్రత్యేక పూజలు చేసి కోతిని ( వానరాన్ని ) ఖననం చేశారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ జంగ లావణ్య, వార్డ్ సభ్యులు కేలేటి శిరీష, పోగుల సమత, చుక్క లతశ్రీ, గ్రామ ప్రముఖులు నక్క రాజయ్య, చుక్క గంగారెడ్డి, దసర్తి రవి, పెద్దనవేని ఓదెలు, కేలేటి పోచరాజు, పోగుల తిరుపతి, గ్రామ పంచాయతీ సిబ్బంది కేతి అంజన్న, దూడ కిరణ్, నక్క రాజలింగు, నక్క గంగన్న, నక్క ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్ల పంపిణీ

**-ఘనంగా మర్రి పురురవరెడ్డి జన్మదిన వేడుకలు**



**సికింద్రాబాద్, ఆగస్టు 12 ( ప్రజామంటలు):** బిజెపి తెలంగాణ రాష్ట్ర యువ నాయకుడు మర్రి పురురవరెడ్డి జన్మదిన వేడుకలు బుధవారం బేగంపేటలో అంగరంగ వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా అమీర్‌పేట్ డివిజన్‌లోని ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు పండ్లను పంపిణీ చేసి మానవత్వాన్ని చాటుకున్నారు. అనంతరం బేగంపేటలోని పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో పలువురు ప్రముఖులు, బిజెపి శ్రేణులు పురురవరెడ్డిని కలిసి పూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు దయానంద్, సికింద్రాబాద్ పార్లమెంట్ కన్వీనర్ రాజశేఖర్ రెడ్డి, మహంకాళి సికింద్రాబాద్ జిల్లా ఓబీసీ మోర్చా అధ్యక్షుడు సురేష్ కుమార్, చేరా శ్రీకాంత్, జిల్లా ప్రధాన కార్యదర్శి నెమలి ఆనంద్ తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# పూర్తైన ఓట్ల ప్రత్యేక రివిజన్ - వెళ్ళడించిన

**బీఆర్ఎస్ నేతల**



**జగిత్యాల ఆగస్టు 12 (ప్రజా మంటలు):** జిల్లాలో మ్యాపింగ్ పూర్తయిన నేపథ్యంలో నియోజకవర్గాల వారీగా ఓటర్ల వివరాలను బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు వెల్లడించారు. జగిత్యాల నియోజకవర్గంలో 2,39,173 ఓట్లకు గాను 2,09,891 ఓట్ల పూర్తైందని, 29,282 ఓట్లు చనిపోయిన/డూప్లికేట్‌గా గుర్తించామని తెలిపారు. కోరుట్లలో 2,49,854 ఓట్లకు గాను 2,23,022, ధర్మపురిలో 2,32,005కు గాను 2,13,374 ఓట్ల ా×= పూర్తయిందన్నారు. డ్రాఫ్ట్ నోటిఫికేషన్ అనంతరం కేటీఆర్ జిల్లాల వారీగా సమావేశాలు నిర్వహిస్తారని చెప్పారు.

# ఫీల్డ్ అసిస్టెంట్లకు న్యాయం జరిగేలా కృషి చేస్తా

**మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్**



**గొల్లపల్లి అగస్ట్ 12 ప్రజా మంటలు :** ధర్మపురి ఫీల్డ్ అసిస్టెంట్లు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్ళి, వారికి న్యాయం జరిగేలా కృషి చేస్తానని రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ హామీ ఇచ్చారు. జగిత్యాల జిల్లా ఫీల్డ్ అసిస్టెంట్ల సంఘం ఆధ్వర్యంలో బుధవారం ధర్మపురి క్యాంపు కార్యాలయంలో మంత్రిని కలిసి తమ సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ఫీల్డ్ అసిస్టెంట్లకు పే స్కేల్ అమలు చేయాలని, ఈ అంశాన్ని రానున్న క్యాబినెట్ సమావేశంలో చర్చించి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లాలని సంఘం ప్రతినిధులు మంత్రిని కోరారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలులో ఫీల్డ్ స్థాయిలో కీలకంగా పనిచేస్తున్న తమకు పే స్కేల్‌తో పాటు ఇతర సమస్యలను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. వారి వినతిపై మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ సానుకూలంగా స్పందించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను క్షేత్రస్థాయిలో ప్రజలకు చేరవేయడంలో ఫీల్డ్ అసిస్టెంట్ల పాత్ర ఎంతో ముఖ్యమని అన్నారు సమస్యలను క్యాబినెట్‌లో చర్చించి ముఖ్యమంత్రి గారి దృష్టికి తీసుకెళ్లడంతో పాటు, అన్ని విధాలా న్యాయం జరిగేలా తన వంతు కృషి చేస్తానని తెలిపారు. అదేవిధంగా ఫీల్డ్ అసిస్టెంట్ల సమస్యలపై తన లెటర్ ప్యాడ్‌పై ముఖ్యమంత్రి కి, పంచాయతీరాజ్ శాఖ మంత్రి కి, పంచాయతీరాజ్ కమిషనర్ కి ప్రత్యేకంగా లేఖలు రాస్తానని మంత్రి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఫీల్డ్ అసిస్టెంట్ల సంఘం అధ్యక్షుడు గడ్డం రమేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి పొన్నం రాజా గౌడ్, జిల్లా వైస్ ప్రెసిడెంట్లు గౌడికర్ శ్రీనివాస్, గోనెపల్లి మహేష్, సాతర్ల బాలరాజ్, మార్కాపురం అశోక్, మామిడి అనిత, మల్లేశం రవి, సుజాత, శ్రీనివాస్, లక్ష్మణ్, ప్రకాష్, భీమన్నతో పాటు అన్ని మండలాల అధ్యక్షులు, కార్యదర్శులు, జిల్లా వ్యాప్తంగా ఉన్న ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

# చిన్నారి జ్ఞానేశ్వరి మిస్సింగ్ కేసు 65 రోజులైన చిక్కని జాడ

**పాప జాడ కోసం తల్లడిల్లుతున్నతల్లిదండ్రులు**

**మరో కుక్క పిల్లను తీసుకొచ్చి జాను పేరుతో పెంచుకుంటున్న దంపతులు**



కాకినాడ జిల్లా, తుని మండలం, సీహెచ్ అగ్రహారం నుంచి అదృశ్యమైన రెండేళ్ల బాలిక జ్ఞానేశ్వరి (జాను) అదృశ్యమై 65 రోజులు గడుస్తున్నా ఎటువంటి ఆచూకీ లభించలేదు. చిన్నారి బుడిబుడి నడకలు, అల్లరిని గుర్తుచేసుకొని తల్లిదండ్రులు తల్లడిల్లుతున్నారు. ఎవరైనా అపహరించి ఉంటే, ఆమెను తమకు అప్పగించాలని పోలీసులు సైతం స్పష్టం చేశారు. వారిపై ఎలాంటి కేసులు నమోదు చేయమని తెలిపినా ఎలాంటి ప్రయోజనం లేకుండా పోయింది. ఈ కేసులో పోలీసులకు ఎలాంటి పురోగతీ కనిపించడం లేదు.కుక్కపిల్లలోనే జానూను చూసుకుంటూ పాప జాడ కోసం తల్లడిల్లుతున్న తల్లిదండ్రులు కుక్కలంటే ఇష్టపడే జానూ జ్ఞాపకంతో మరో శునకాన్ని పెంచుకుంటూ పాప పేరే దానికి పెట్టారు. దానిలోనే చిన్నారిని చూసుకుంటూ కాలం వెళ్లదీస్తున్నారు. గారాల పట్టి క్షేమంగా తిరిగి వస్తుందనే ఆశతో ఎదురుచూస్తున్నారు. జూన్ 6న ఉదయం తోటలో చిన్నారి అదృశ్యమైంది. జానూ వెనుక వెళ్లిన శునకం వారం తర్వాత అనారోగ్యంతో చనిపోయింది. చిన్నారి అదృశ్యమైన నాటి నుంచే పోలీసులు ముమ్మరంగా గాలింపు చేపట్టారు. ఇప్పటికీ చిన్నారి అదృశ్యం కేసు ఓ మిస్టరీగానే మిగిలింది. పాపను ఎవరైనా తీసుకెళ్లి ఉంటే అప్పగించాలని తల్లి భవానీ కోరుతున్నారు."మా జానుకు కుక్కలంటే చాలా ఇష్టం. అందుకే మేము పెంచుకోవడానికి ఈ కుక్కపిల్లను ఇంటికి తెచ్చుకున్నాం. మా అమ్మాయిపై ఉన్న ప్రేమతో, ఆ కుక్కపిల్లకు కూడా ఆమె పేరే పెట్టాం. ఫోన్లలో ఆమె అల్లరి చేష్టల వీడియోలను చూస్తూ, ఆమె జ్ఞాపకాలతోనే మేము జీవిస్తున్నాం. ఈ కుక్కపిల్లలో మా జానును చూసుకుంటున్నాం. ఎవరైనా మా అమ్మాయిని తీసుకువెళ్లి ఉంటే, దయచేసి ఆమెను మాకు తిరిగి అప్పగించండి. మేము ఎటువంటి చట్టపరమైన చర్యలూ తీసుకోం". భవాని, జ్ఞానేశ్వరి తల్లి.5,000 ఫోన్ కాల్‌ల విశ్లేషణ స్నిఫర్ డాగ్స్ (జాగిలాలు), అటవీ శాఖ, 'హనుమాన్' బృందాలు, అత్యాధునిక డ్రోన్ కెమెరాలను ఉపయోగించి గాలింపు చర్యలు చేపట్టారు. కిడ్నాప్ కోణంలో దర్యాప్తు చేస్తూ, అధికారులు ఆరు స్థానిక మొబైల్ టవర్ల పరిధిలోని 15,000 ఫోన్ కాల్‌లను విశ్లేషించారు. వీటిలో 400 నుంచి 500 అనుమానాస్పద కాల్‌లను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ కాల్‌లకు సంబంధం ఉన్న వ్యక్తులను విచారించి, వారి వాంగ్మూలాలను నమోదు చేశారు. జాను ఆచూకీ కోసం తెలంగాణలోని వివిధ ప్రాంతాల్లో గాలింపు చర్యలు సాగాయి. అయితే 40 జజుఎ కెమెరాల ఫుటేజీని పరిశీలించినప్పటికీ ఎటువంటి ఫలితం లభించలేదు. మిస్టరీగా మారిన చిన్నారి అదృశ్యం కేసు : రెండు నెలలు గడిచినా చిన్నారి జాడ మాత్రం దొరకలేదు. తలుపు చప్పుడు వినిపిస్తే చాలు. మా జాను వచ్చిందేమో అని ఆ తల్లి ఆశగా చూస్తోంది. తండ్రి చూపులన్నీ ఆ తోట దారినే వెతుకుతున్నాయి. పోలీసుల దర్యాప్తు కొనసాగుతూనే ఉంది. ఇంత టెక్నాలజీ వాడినా ఇన్ని బలగాలను ఉపయోగించినా పాప ఆచూకీ దొరకకపోవటం మిస్టరీగా మారింది. పాప కోసం పోలీసు బృందాలు తీవ్రంగా గాలిస్తున్నారు. అంతేకాకుండా పాపను తిరిగి వారి తల్లిదండ్రుల దగ్గరకు చేర్చితే రివార్డు ఇస్తామని కూడా ప్రకటించారు.

# ప్రైమ్ లొకేషన్‌లో ఇందిరమ్మ ఇళ్ల టవర్స్ నిర్మాణం హౌసింగ్‌బోర్డు చరిత్రలో ఇదే తొలిసారి

**హైదరాబాద్‌లోని కేపీహెచ్‌బీ ప్రైమ్ లొకేషన్‌లో ఇందిరమ్మ ఇళ్ల టవర్స్‌కు శంకుస్థాపన**

**ఒక్కో టవర్‌కు రూ.10.80 కోట్ల చొప్పున నాలుగింటికి రూ.43 కోట్లతో నిర్మాణం**

**రెండు ఫేజ్‌లలో 1080 ఇళ్ల నిర్మాణం**



హైదరాబాద్ నగరంలో పేదల సొంతింటి కల నెరవేరే దిశగా మరో కీలక అడుగు త్వరలోనే పడనుంది. నగరంలో అత్యంత ఖరీదైన ప్రాంతంలోని భూమిలో ఇందిరమ్మ టవర్స్ నిర్మించేందుకు అధికార యంత్రాంగం ఏర్పాట్లు ముమ్మరం చేస్తోంది. త్వరలోనే భూమి పూజ నిర్వహించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. దీనిలో భాగంగా కేపీహెచ్‌బీలోని మలేషియన్ టౌన్‌షిప్ ఎదురుగా ఉన్న హౌసింగ్ బోర్డుకు చెందిన స్థలంలో బహిరంగ సభకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ సందర్భంగానే సీఎం రేవంత్‌రెడ్డి టవర్లకు సంబంధించిన శిలాఫలకం ఆవిష్కరించనున్నట్లు తెలిసింది.ప్రైమ్ లొకేషన్‌లో నిర్మాణం : హైదరాబాద్‌లోని కేపీహెచ్‌బీ 7, 9 ఫేజ్‌లు, గోకుల్ ఫ్లాట్స్ మధ్యలో ఉన్న అత్యంత ప్రైమ్ లొకేషన్‌లో ఈ ఇందిరమ్మ ఇళ్ల టవర్స్ నిర్మిస్తున్నారు. ఒక్కో టవర్‌కు రూ.10.80 కోట్ల చొప్పున వెచ్చించనున్నారు. ఈ నేపథ్యంలోనే నాలుగింటికి రూ.43 కోట్లు ఖర్చు చేయనున్నారు. సంవత్సరంలోగా దీనికి సంబంధించిన పనులు పూర్తి చేయాలని నిశ్చయంతో ఉన్నారు.మంగళవారం అధికారులు విడుదల చేసిన లేఅవుట్ ప్రకారం ఫేజ్ 1, 2 ఇందిరమ్మ ఇళ్లను ఒకే ప్రాంతంలో నిర్మించనున్నారు. రెండు టవర్లకు కలిపి 5.87 ఎకరాల భూమిని కేటాయించారు. ఫేజ్-1 కింద 480, ఫేజ్-2 కింద 600 ఇళ్లు నిర్మించనున్నారు.47 ఏళ్ల చరిత్రలో తొలి టవర్స్ 1980లో కేపీహెచ్‌బీ హౌసింగ్ బోర్డు కోసం దసరా సమయంలో పేజ్ 1, 2 ప్రాంతంలో ఇళ్లకు శంకుస్థాపన చేశారు. 47 ఏళ్ల కాలంలో ఎల్ఐజీ, ఎంఐజీ, హెచ్ఐజీ, ఈడబ్ల్యుఎస్ నివాసాలు వేలల్లోనే నిర్మించింది. తొలి గేటెడ్ కమ్యూనిటీగా మలేషియన్ టౌన్‌షిప్ నిర్మాణమైంది. తాజాగా ప్రభుత్వం నిర్మించనున్న ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి టవర్స్ మాదిరి నిర్మించడం హౌసింగ్‌బోర్డు చరిత్రలోనే ఇదే మొదటిసారి.ఏడాదిలో నిర్మించకుంటే ఫీజు రూ. 10 వేలు వాపస్ : హైదరాబాద్ పరిధిలోని 16 నియోజకవర్గాల్లో నిర్మిస్తున్న మొత్తం 7,340 ఇళ్లకు దరఖాస్తు గడువు ఆఖరు తేదీ ఈ నెల 15 వరకు పొడిగించి విషయం తెలిసిందే. లబ్ధిదారుల ఎంపిక కోసం ఆగస్టు 20న లాటరీ తీయాలని ప్రాథమికంగా నిర్ణయించనున్నారు. ఏడాదిలోపు ఇళ్లను నిర్మించి ఇస్తామని, ఒకవేళ ఇళ్లను కేటాయించని పక్షంలో దరఖాస్తుదారులు చెల్లించిన ధరావతు ఫీజు రూ.10 వేలను తిరిగి చెల్లిస్తామని ప్రభుత్వ యంత్రాంగం పేర్కొంది. దీనిపై ఎలాంటి సందేహాలు ఉన్నా 040-24603572 ఫోన్ నెంబరును సంప్రదించాలని ఒక ప్రకటనలో వెల్లడించారు.సెలవుల నేపథ్యంలో గడువు పెంపు ఇటీవల ఇళ్ల దరఖాస్తునకు గడువును ఈ నెల 15 వరకు పెంచారు. వరుసగా రెండో శనివారం, బోనాల సెలవులు రావడంతో గడువు పెంచాలని వివిధ వర్గాల నుంచి వచ్చిన వినతులను పరిగణనలోనికి తీసుకుని దరఖాస్తులు స్వీకరించాలని నిర్ణయించినట్లు మంత్రి పొంగులేటి శ్రీనివాస్ పేర్కొన్నారు. దరఖాస్తుల పరిశీలన, లాటరీ ప్రక్రియ మాత్రం ఆలస్యం కాకుండా చూడాలని హౌసింగ్ బోర్డుకు మంత్రి సూచించారు. ఈ నెలాఖరు నాటికి కేటాయింపు ప్రక్రియ పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.రూ.60 లక్షలు చేసే ఫ్లాట్ కేవలం రూ.6 లక్షలకే : ఇళ్ల కోసం జులై 21 నుంచి ఆగస్టు 15 వరకు మీ సేవ ద్వారా దరఖాస్తులను గృహ నిర్మాణ శాఖ స్వీకరిస్తోంది. బహిరంగ మార్కెట్‌లో రూ.30-58 లక్షల వరకు ధర పలికే ఫ్లాట్లను ప్రజల సంక్షేమం కోసం కేవలం రూ.6 లక్షలకే ఇస్తున్నట్లు అధికార వర్గం స్పష్టం చేసింది. ఇళ్ల లబ్ధిదారులకు ఉచితంగా రిజిస్ట్రేషన్ చేయనున్నట్లు తెలిపింది. దరఖాస్తు సమయంలో ఎటువంటి కుల, ఆదాయపత్రాలు సమర్పించాల్సిన అవసరం లేదని వెల్లడించింది.

# మెడికో ప్రియాంక హత్యోదంతం నిందితులకు కఠిన శిక్ష పడేలా ప్రభుత్వం చర్యలు

**వైద్య విద్యార్థిని ప్రియాంకను కారుతో ఢీ కొట్టి చంపిన కేసులో నిందితులకు కఠిన శిక్ష పడేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తూర్పు గోదావరి జిల్లా లోని కూటమి ఎమ్మెల్యేలు స్పష్టం**



రాజమహేంద్రవరంలో వైద్య విద్యార్థిని ప్రియాంకను కారుతో ఢీ కొట్టి చంపిన కేసులో నిందితులకు కఠిన శిక్ష పడేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తూర్పుగోదావరి జిల్లాలోని కూటమి ఎమ్మెల్యేలు స్పష్టం చేశారు. హత్యతో సమానమైన సెక్షన్లు నమోదు చేసి నిందితులపై కఠినంగా శిక్షపడేలా ప్రభుత్వం చర్యలు తీసుకుందని తెలిపారు. కేసు దర్యాప్తుపై ఎక్కడా అనుమానించాల్సిన అవసరం లేదని, బాధిత కుటుంబానికి తాము అండగా ఉంటామని ఎమ్మెల్యేలు ఆదిరెడ్డి శ్రీనివాస్, బుచ్చయ్య చౌదరి, నల్లమిల్లి రామకృష్ణారెడ్డి భరోసా ఇచ్చారు.ఫాస్ట్ ట్రాక్ కోర్టును ఏర్పాటును పరిశీలిస్తున్నాం: ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రత్యేకంగా 2 గంటల పాటు సమీక్షించారని, నిందితులకు కఠిన శిక్ష పడేలా చర్యలు తీసుకోవాలని తమకు, పోలీసులకు స్పష్టంగా ఆదేశించినట్లు తెలిపారు. ప్రియాంక కుటుంబానికి తామంతా అండగా ఉన్నామని బాధిత కుటుంబానికి న్యాయం జరిగే వరకు అండగా ఉంటామన్నారు. కేసులో నిందితులకు కఠిన శిక్ష పడేందుకు ఫాస్ట్ ట్రాక్ కోర్టును ఏర్పాటు చేయాలని ప్రియాంక తండ్రి కోరిన విషయాన్ని సీఎం దృష్టికి తెచ్చామని ఎమ్మెల్యేలు తెలిపారు.ప్రభుత్వ ప్రమేయమేం లేదు: ప్రత్యేకంగా స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీం వేసి అన్ని కోణాల్లో సమగ్ర దర్యాప్తు చేస్తారని తెలిపారు. ప్రియాంక ఘటనలో ఎక్కడా పోలీసుల వైఫల్యం లేదని స్పష్టం చేశారు. ఘటన జరిగినప్పుడు కొందరు మీడియా ప్రతినిధులు ఘటనా స్థలిలో ఉన్నప్పటికీ వార్త రాయలేదని, 3 రోజులపాటు మీడియాలో ఎక్కడా వార్త రాకుండా ఎవరు, ఎవరిని మేనేజ్ చేశారనే విషయంపైనా సిట్ దర్యాప్తు చేస్తుందన్నారు. ఘటన బయటకు రాకపోవడం వెనుక ప్రభుత్వ ప్రమేయం ఏమీ లేదని స్పష్టం చేశారు. నిందితులు ఎంతటివారైనా వదిలే ప్రసక్తి లేదని కఠినంగా శిక్షిస్తామని ఎమ్మెల్యేలు స్పష్టం చేశారు.అసలేం జరిగిందంటే: ప్రియాంక ఈ నెల 3న రాత్రి రాజమహేంద్రవరం ప్రసాద్ ఆదిత్యమాల్‌లో సినిమా చూసి, సహచర విద్యార్థి ఉమేష్‌తో కలిసి ద్విచక్ర వాహనంపై బయలుదేరారు. రద్దీ కారణంగా వాహనాలు థియేటర్ గేటు వద్ద ఆగగా అదే సమయంలో నామవరానికి చెందిన సురవరపు దుష్యంత్, లాలాచెరువుకు చెందిన ఆంద్రూ విలియం జోసెఫ్‌లు మద్యం మత్తులో కారు వేగంగా నడుపుతూ వచ్చి వీరి బైక్‌ను ఢీకొట్టారు. తరువాత మరో రెండుసార్లు బలంగా ఢీకొట్టి, పైనుంచి కారు వెళ్లడంతో కిందపడిపోయిన ప్రియాంక తలకు తీవ్ర గాయమైంది. ఆమెను స్థానికంగా ఉన్న ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేర్చారు. పరిస్థితి విషమించడంతో బుధవారం సికింద్రాబాద్‌లోని కిమ్స్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ ఆమె చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందారు.

# హైదరాబాద్ ఓటర్ల జాబితాలో భారీ కోత 19 లక్షల ఓట్లు గల్లంతు

**ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణతో హైదరాబాద్‌లో భారీ మార్పులు**

**దాదాపు 19 లక్షల మంది ఓటర్లను జాబితా నుంచి తొలగించే అవకాశం**

**తెలంగాణ వ్యాప్తంగా 73 లక్షల ఓట్లకు కోత పడనున్నట్లు అంచనా**

**ఆగస్టు 17 నుంచి ఫారం 6 ద్వారా తిరిగి నమోదుకు అవకాశం**




తెలంగాణ రాష్ట్రంలో జరుగుతున్న ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (సర్) ప్రక్రియ వల్ల హైదరాబాద్ జిల్లా ఓటర్ల జాబితాలో భారీ కోత పడనుంది. తాజా నివేదికల ప్రకారం, జిల్లాలోని ఓటర్ల జాబితా నుండి ఏకంగా 40 శాతానికి పైగా పేర్లను తొలగించే అవకాశం ఉంది. సుమారు 19 లక్షల మంది ఓటర్ల పేర్లను తొలగించవచ్చని తెలంగాణ రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి కార్యాలయ వర్గాలు వెల్లడించాయి.ఓటరు ఫారాల సేకరణ గడువు సోమవారం సాయంత్రం 6 గంటలతో ముగిసింది. హైదరాబాద్ జిల్లాలో మొత్తం 47,36,669 మంది ఓటర్లు ఉండగా, కేవలం 27,89,214 (58.89 శాతం) ఫారాలు మాత్రమే డిజిటలైజేషన్ ప్రక్రియకు నోచుకున్నాయి. మిగిలిన 41 శాతానికి పైగా ఫారాలు 'సేకరించలేనివి' అనే విభాగంలోకి రావడంతో, వాటిని ముసాయిదా జాబితా నుండి మినహాయించనున్నారు.ఇతర ప్రాంతాలకు శాశ్వతంగా వలస వెళ్లడం, ఇచ్చిన చిరునామాలో ఓటర్లు అందుబాటులో లేకపోవడం, మరణించడం లేదా డూప్లికేట్ ఓట్లు ఉండటం వంటి కారణాల వల్ల ఈ తొలగింపులు చోటు చేసుకుంటున్నాయి. దీనిపై నగర ప్రజల్లో సరైన అవగాహన లేకపోవడం, వర్షాకాలం కారణంగా క్షేత్రస్థాయిలో ప్రక్రియ మందగించడం కూడా ఫారాల సేకరణపై ప్రభావం చూపాయి.రాష్ట్రవ్యాప్తంగా పరిశీలిస్తే, మొత్తం 3.38 కోట్ల ఓటర్లలో సుమారు 73 లక్షల మందిని జాబితా నుండి తొలగించే అవకాశం కనిపిస్తోంది. ఇది రాష్ట్ర మొత్తం ఓటర్లలో 21 శాతానికి పైగా తగ్గుదలగా నమోదు కావొచ్చు. హైదరాబాద్ తర్వాత మేడ్చల్-మల్కాజిగిరి (36 శాతం), రంగారెడ్డి (34 శాతం) జిల్లాల్లో అత్యధికంగా ఓట్లు తొలగింపు ప్రక్రియ జరుగుతోంది. అయితే, ఓటర్ల జాబితా నుండి పేరు తొలగింపునకు గురైన వారు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని అధికారులు పేర్కొంటున్నారు. ఆగస్టు 17న ముసాయిదా జాబితాను ప్రచురించిన అనంతరం, అభ్యంతరాలు తెలపడానికి, మార్పులు-చేర్పుల కోసం మరోసారి అవకాశం కల్పిస్తారు. అర్హులైన వారు ఫారం-6 ద్వారా ఓటు హక్కు కోసం తిరిగి దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు.

# సంగారెడ్డి జిల్లాలో ఘోర ప్రమాదం ఆటోను ఢీకొట్టిన ట్యాంకర్ ఐదుగురి మృతి




సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ మండలంలో మంగళవారం చోటుచేసుకున్న ఘోర రోడ్డు ప్రమాదంలో ఐదుగురు మృతి చెందారు. ప్రయాణికులతో వెళ్తున్న ఆటోను ఓ ఆయిల్ ట్యాంకర్ బలంగా ఢీకొట్టడంతో ఈ దుర్ఘటన సంభవించింది. ఈ ప్రమాదంతో ఆ ప్రాంతంలో విషాదఛాయలు అలుముకున్నాయి.జహీరాబాద్ మండలం సత్వార్ గ్రామ సమీపంలోని యూ-టర్న్ వద్ద ఈ ప్రమాదం జరిగింది. అతివేగంగా వచ్చిన ఆయిల్ ట్యాంకర్ ఆటోను ఢీకొట్టడంతో ఐదుగురు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. మృతులను కర్ణాటక రాష్ట్రం బీదర్ జిల్లా రాజగిరి గ్రామానికి చెందిన వారిగా గుర్తించారు. వీరంతా ఉపాధి నిమిత్తం జహీరాబాద్ పరిసర ప్రాంతాల్లో కూలి పనుల కోసం హుమ్నాబాద్ నుంచి వచ్చినట్లు సమాచారం.ప్రమాద సమయంలో ఆటోలో మొత్తం 14 మంది ప్రయాణికులు ఉండగా, హైదరాబాద్ నుంచి కర్ణాటక వైపు వెళ్తున్న ట్యాంకర్ వేగంగా వచ్చి ఢీకొట్టింది. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని, క్షతగాత్రులను చికిత్స నిమిత్తం స్థానిక ఆసుపత్రికి తరలించారు.ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. కాగా, ఈ రోడ్డు ప్రమాదంపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేయడంతో పాటు, గాయపడిన వారికి మెరుగైన వైద్య సదుపాయాలు అందజేయాలని అధికారులను ఆదేశించారు.

# అమరావతి రోడ్డు పనులకు హైకోర్టు పచ్చజెండా పిటిషన్లు కొట్టివేత

**అమరావతి సీడ్ యాక్సెస్ రోడ్డు పనులకు మార్గం సుగమం .భూసేకరణను సవాలు చేసిన రైతుల పిటిషన్లను కొట్టివేసిన హైకోర్టు .ప్రజా ప్రయోజనాల దృష్ట్యా ప్రక్రియను ఆపలేమన్న న్యాయస్థానం .ప్రభుత్వ నోటిఫికేషన్‌కు వ్యతిరేకంగా కోర్టును ఆశ్రయించిన రైతులు**



రాజధాని అమరావతిలో అత్యంత కీలకమైన సీడ్ యాక్సెస్ రోడ్డు నిర్మాణానికి మార్గం సుగమమైంది. ఈ రోడ్డు నిర్మాణం కోసం ప్రభుత్వం చేపట్టిన భూసేకరణ ప్రక్రియను సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లను ఆంధ్రప్రదేశ్ హైకోర్టు కొట్టివేసింది. విస్తృత ప్రజా ప్రయోజనాల దృష్ట్యా ఈ ప్రాజెక్టును నిలిపివేయలేమని స్పష్టం చేస్తూ న్యాయస్థానం తీర్పు వెలువరించింది.సీడ్ యాక్సెస్ రోడ్డు నిర్మాణానికి సంబంధించి ప్రభుత్వం జారీ చేసిన భూసేకరణ నోటిఫికేషన్‌ను పలువురు రైతులు హైకోర్టులో సవాలు చేశారు. అధికారులు చట్టపరమైన నిబంధనలను పాటించలేదని, కాబట్టి ఆ నోటిఫికేషన్‌ను, తత్సంబంధిత ప్రక్రియను రద్దు చేయాలని వారు తమ పిటిషన్లలో కోరారు. ప్రభుత్వ పక్షాన అడ్వకేట్ జనరల్ దమ్మాలపాటి శ్రీనివాస్ వాదనలు వినిపిస్తూ, భూసేకరణ ప్రక్రియ పూర్తిగా నిబంధనల ప్రకారమే జరుగుతోందని కోర్టుకు వివరించారు.ఇరువర్గాల వాదనలు విన్న న్యాయస్థానం, గతంలో తీర్పును రిజర్వ్‌లో ఉంచింది. ఈ నేపథ్యంలో, మంగళవారం ఆ పిటిషన్లను కొట్టివేస్తూ తుది తీర్పునిచ్చింది. ప్రజా ప్రయోజనాలే అత్యంత ప్రధానమని, వాటి కోసం చేపడుతున్న పనులకు అడ్డుకట్ట వేయలేమని ధర్మాసనం తన తీర్పులో పేర్కొంది. హైకోర్టు తాజా తీర్పుతో సీడ్ యాక్సెస్ రోడ్డు నిర్మాణ పనులకు ఉన్న న్యాయపరమైన అడ్డంకులు పూర్తిగా తొలగిపోయాయి.

# ఎల్బీనగర్ పోలీస్ స్టేషన్ లో ఉరేసుకున్న కానిస్టేబుల్

**పీఎస్ ముందు కుటుంబ సభ్యుల నిరసన .కానిస్టేబుల్ ఆత్మహత్యకు కారణాలపై దర్యాప్తు చేస్తున్న పోలీసులు.ఎల్బీనగర్ పీఎస్ ముందు కానిస్టేబుల్ కుటుంబసభ్యుల ఆందోళన తమకు చూపించకుండానే మృతదేహాన్ని ఎందుకు తరలించారని ఆగ్రహం**



మల్కాజ్‌గిరి కమిషనరేట్ పరిధిలోని ఎల్బీనగర్ పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్ ఆత్మహత్య చేసుకున్న ఘటన కలకలం రేపింది. 2024 బ్యాచ్‌కు చెందిన కానిస్టేబుల్ సాయికుమార్ రాత్రి విధుల్లో ఉండి ఠాణాలోని బాత్‌రూంలో తెల్లవారుజామున ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కానిస్టేబుల్ ఆత్మహత్యకు గల కారణాలపై పోలీసు ఉన్నతాధికారులు విచారణకు ఆదేశించారు. పోస్టుమార్టం కోసం మృతదేహాన్ని ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు.హాస్పిటల్‌కు తీసుకెళ్లే సరికే : ఈరోజు తెల్లవారు జామున 2.30 గంటలకు ఘటన జరిగినట్లు చెబుతున్నారు. ఆత్మహత్యకు పాల్పడ్డాడనే విషయాన్ని తెలుసుకున్న వెంటనే తోటి పోలీసు సిబ్బంది అతనిని ముందుగా కామినేని ఆస్పత్రికి తరలించారు. దీంతో పరీక్షించిన వైద్యులు అప్పటికే సాయికుమార్ మృతిచెందినట్లు నిర్ధారించారు. తమకు మృతదేహాన్ని చూపించకుండానే పోస్టుమార్టం కోసం ఎందుకు తరలించారని సాయికుమార్ కుటుంబ సభ్యులు పోలీస్‌స్టేషన్ ముందు ఆందోళనకు దిగారు. ఎల్బీనగర్ పోలీసుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు.కానిస్టేబుల్ జె.సాయికుమార్ ఎల్బీనగర్ ఏసీపీ ఆఫీసులో విధులు 2024లో కానిస్టేబుల్ ఉద్యోగానికి ఎంపికైన సాయికుమార్ ప్రస్తుతం ఈ-కాప్స్ డ్యూటీ కోసం ఎల్బీనగర్ అసిస్టెంట్ కమిషనర్ పోలీస్ కార్యాలయానికి అటాచ్ చేశారు. ఎల్బీనగర్‌కు సమీపంలోని కర్మన్‌ఘాట్‌లోనే స్నేహితులతో కలిసి ఓ గదిలో ఉంటున్నారు. ఈ క్రమంలోనే ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఆత్మహత్యకు గల కారణాలు ఇంకా తెలియాల్సి ఉంది.

# 2026 ఖేలో ఇండియా గేమ్స్‌కు తెలంగాణ

**ఈవెంట్‌ను అత్యంత ఘనంగా నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయం**

**హైదరాబాద్‌లోని స్టేడియాల ఆధునికీకరణకు అధికారులకు ఆదేశాలు**

**ప్రారంభ, ముగింపు వేడుకలకు ప్రముఖ క్రీడాకారులు, సినీ తారలను ఆహ్వానించాలని సూచన**



ప్రతిష్ఠాత్మక 'ఖేలో ఇండియా యూత్ గేమ్స్ 2026'ను అత్యంత ఘనంగా నిర్వహిస్తామని తెలంగాణ ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి ప్రకటించారు. ఈ మెగా క్రీడా ఈవెంట్‌కు తెలంగాణ ఆతిథ్యం ఇవ్వనున్న నేపథ్యంలో మంగళవారం ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీ క్యాంపస్‌లోని బోధి పెవిలియన్‌లో క్రీడాశాఖ మంత్రి వాకిటి శ్రీహరి, ఉన్నతాధికారులతో సీఎం ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ జాతీయ స్థాయి క్రీడల్లో పలు రాష్ట్రాల నుంచి క్రీడాకారులు పాల్గొంటారని, వారికి అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేయాలని సీఎం అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా హైదరాబాద్‌లోని స్టేడియాల ప్రస్తుత పరిస్థితిని అంచనా వేసి, క్రీడల నిర్వహణకు అనుగుణంగా వాటిని శాశ్వత ప్రాతిపదికన ఆధునికీకరించాలని స్పష్టం చేశారు. ఇందుకు అవసరమైన నిధులను ప్రభుత్వం కేటాయించడానికి సిద్ధంగా ఉందని ఆయన హామీ ఇచ్చారు.ఖేలో ఇండియా యూత్ గేమ్స్‌లో భాగంగా 20 క్రీడాంశాల్లో పోటీలు జరగనున్నందున, ప్రతి క్రీడకు వేదికలను గుర్తించి అవసరమైన ఏర్పాట్లు చేయాలని రేవంత్‌రెడ్డి సూచించారు. ప్రారంభ, ముగింపు వేడుకలను అట్టహాసంగా నిర్వహించేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథులను, ప్రఖ్యాత క్రీడాకారులను, సినీ ప్రముఖులను ఆహ్వానించేందుకు ఇప్పటి నుంచే సన్నాహాలు ప్రారంభించాలని సీఎం దిశానిర్దేశం చేశారు. ఈవెంట్ నిర్వహణలో అధికారులకు మౌలిక వసతులు, ఈవెంట్ మేనేజ్‌మెంట్, అతిథుల సౌకర్యాలపై ప్రత్యేక బాధ్యతలు అప్పగించాలని స్పష్టం చేశారు.ఈవెంట్ విజయవంతం కావడానికి రాష్ట్రానికి చెందిన అర్జున అవార్డు గ్రహీతలు, తెలంగాణ స్పోర్ట్స్ హబ్ బోర్డు సభ్యులు, ఒలింపిక్ అసోసియేషన్, జాతీయ స్థాయి క్రీడా ప్రతినిధుల సలహాలు, సూచనలు తీసుకోవాలని సీఎం అన్నారు. ప్రతి ఈవెంట్‌ను నిజమైన క్రీడా స్ఫూర్తిని ప్రతిబింబించేలా నిర్వహించాలని ఆయన ఆకాంక్షించారు. ఈ సమీక్ష సమావేశంలో ప్రభుత్వ సలహాదారు రామకృష్ణారావు, స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ (శాట్) ఛైర్మన్ శివసేనారెడ్డి, క్రీడల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్, శాట్ ఎండీ సోనీ బాలాదేవి తదితరులు పాల్గొన్నారు.

PRINTED AND PUBLISHED BY V.NARSINGAM, ON BEHALF OF CH.V. PRABHAKAR RAO AND PRINTED AT SRI S HARADHA OFFSET PRINTERS. H.NO.9-14/8/3, BUGGARAM VILLAGE AND MANDAL, BUGGARAM GRAMAPANCHAYATH- 505454, JAGTIAL DISTRICT, TELANGANA STATE.. PUBLISHED AT 6-6-206,PADMA NAGAR, JAGTIAL - 505327, JAGTIAL DISTRICT, TELANGANA STATE. EDITOR : CH V. PRABHAKAR RAO, RNI . TELTEL/2021/81092 : PHONE : 9391533339 EMAIL: prajamantalu@gmail.com